

నోరు లేని మేకల్నే బలి ఇస్తారు.
సింహాల్ని బలివ్వరు, గుర్తించుకోండి.
- డా. బిఆర్ అంబేద్కర్

REGD NO : APTEL 16144

# జనస్వరం

పవర్ అక్షరమే ఆయుధం

www.Janaswaram.com

జనస్వరం న్యూస్ తెలుగు వారపత్రిక ద్వారా తక్కువ ఖర్చుతో పుట్టినరోజు శుభాకాంక్షలతో పాటు అన్నీ కార్యక్రమాలకు ప్రకటనలకు సంప్రదించండి.
మా మెయిల్ ఐడి : janaswaramnews@gmail.com
మొబైల్ నెంబర్ : 9642067900

సంపుటి : 4 | సంచిక : 308 | ఎడిటర్ : నరేష్ సాకే | వార సంచిక : 22 - 05 - 2025 | పేజీలు : 6


# కుంకీ ఏనుగులను నేనే జాగ్రత్తగా చూసుకుంటా... - ఏపీ డిప్యూటీ సీయం : పవన్ కళ్యాణ్

- ఏపీకి ఐదు కుంకీ ఏనుగులను అందించిన కర్ణాటక ప్రభుత్వం
- కర్ణాటక విధానసౌధలో ఏనుగులను స్వీకరించిన పవన్ కళ్యాణ్
- రాజకీయాలకు అతీతంగా సాయం చేసిన కర్ణాటకకు కృతజ్ఞతలు తెలిపిన పవన్


**కర్ణాటక, మే 21, జనస్వరం :** ఆంధ్రప్రదేశ్‌లో పంట పొలాలు, జనావాసాలపై ఏనుగులు చేస్తున్న దాడులతో జరుగుతున్న ప్రాణ, ఆస్తి నష్టాన్ని నివారించే దిశగా ప్రభుత్వం కీలక చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా, కర్ణాటక ప్రభుత్వం అందించిన ఐదు కుంకీ ఏనుగులను రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ స్వయంగా స్వీకరించారు. ఈ ఏనుగుల సంరక్షణ బాధ్యతను తానే చూసుకుంటానని ఆయన స్పష్టం చేశారు. కర్ణాటక విధానసౌధలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ అటవీ శాఖ మంత్రి ఈశ్వర్ ఖాండ్రే సమక్షంలో ఈ ఐదు కుంకీ ఏనుగులను ఆంధ్రప్రదేశ్ అటవీ శాఖ అధికారులకు అప్పగించారు. ఈ సందర్భంగా పవన్ కల్యాణ్ మాట్లాడుతూ, "కుంకీ ఏనుగులను అత్యంత జాగ్రత్తగా చూసుకుంటామని కర్ణాటక ముఖ్యమంత్రి గారికి, అటవీ శాఖ మంత్రి గారికి మాట ఇస్తున్నాను. వాటి సంరక్షణను నేనే స్వయంగా పర్యవేక్షిస్తాను" అని హామీ ఇచ్చారు. గత రెండు దశాబ్దాలుగా జనావాసాల్లోకి అడవి ఏనుగులు చొరబడటం వల్ల ఎంతో మంది ప్రాణాలు కోల్పోయారని, ఆస్తులు ధ్వంసమయ్యాయని పవన్ ఆవేదన వ్యక్తం చేశారు. "ఈ రోజు మనకు అందిన ఈ కుంకీ ఏనుగుల వల్ల భవిష్యత్తులో ఎంతో మంది ప్రాణాలను కాపాడగలుగుతాం, ఆస్తి నష్టాన్ని కూడా నివారించగలుగుతాం" అని ఆయన తెలిపారు. అంతేకాకుండా, ఎర్రచందనం అక్రమ రవాణాను అరికట్టడం, అటవీ సంపద పరిరక్షణ వంటి పలు కీలక అంశాల్లో ఇరు రాష్ట్రాలు పరస్పరం సహకరించుకోవడానికి సిద్ధంగా ఉన్నాయని పవన్ వెల్లడించారు. "రెండు రాష్ట్రాల్లో వేర్వేరు రాజకీయ కూటములకు చెందిన ప్రభుత్వాలు ఉన్నప్పటికీ, పర్యావరణ పరిరక్షణ అనే ముఖ్యమైన అంశంలో సహకరించేందుకు కర్ణాటక ప్రభుత్వం ముందుకు రావడం అభినందనీయం. వారు కేవలం ఏనుగులనే కాదు, ఆంధ్ర ప్రజల కోసం వారి హృదయాన్నే తెరిచారు" అంటూ కర్ణాటక ప్రభుత్వానికి ఆయన ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా, కుంకీ ఏనుగులకు సంబంధించిన ధృవపత్రాలను, సంరక్షణ వివరాల డాక్యుమెంట్లను కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య ఉప ముఖ్యమంత్రి పవన్ కు అందజేశారు. ఈ కుంకీల రాకతో రాష్ట్రంలోని ఏజెన్సీ ప్రాంతాలు, అటవీ సరిహద్దు గ్రామాల ప్రజలకు కొంత ఊరట లభించనుంది. ఆంధ్రప్రదేశ్‌లో అడవి ఏనుగుల దాడులతో అల్లాడుతున్న రైతులకు ఊరట లభించనుంది. రాష్ట్ర ప్రభుత్వం చేసిన కృషి ఫలించి, కర్ణాటక నుంచి ఐదు శిక్షణ పొందిన కుంకీ ఏనుగులు ఏపీకి రానున్నాయి. కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, ఆ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్, ఏపీ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్




సమక్షంలో ఈ ఏనుగులను ఏపీకి అప్పగించే కార్యక్రమం జరిగింది. బెంగళూరులోని విధానసౌధలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ అప్పగింతకు ముందే, ఏపీకి రానున్న ఐదు ఏనుగుల పేర్లను కర్ణాటక ప్రభుత్వం విడుదల చేసింది. వాటి పేర్లు రంజని, దేవా, కృష్ణ, అభిమన్యు, మహేంద్ర అని వెల్లడించింది.

గత కొన్నేళ్లుగా ఆంధ్రప్రదేశ్‌లోని సరిహద్దు ప్రాంతాల్లో... అడవి ఏనుగుల గుంపులు అటవీ ప్రాంతాల్లోంచి వచ్చి పంట పొలాలపై పడి తీవ్ర నష్టాన్ని కలిగిస్తున్నాయి. కొన్ని సందర్భాల్లో గ్రామాలపై దాడులు చేస్తూ ప్రజల ప్రాణాలకు కూడా ముప్పుగా పరిణమించాయి. ఈ సమస్య రైతులను తీవ్ర ఆందోళనకు గురిచేస్తుండటంతో, దీనికి శాశ్వత పరిష్కారం కనుగొనాలని ఏపీ ఉప ముఖ్యమంత్రి, అటవీశాఖ మంత్రి పవన్ కల్యాణ్ ప్రత్యేక చొరవ తీసుకున్నారు. ఇందులో భాగంగా, ఆయన బెంగళూరు వెళ్లి కర్ణాటక ప్రభుత్వంతో చర్చలు జరిపారు. అనంతరం కర్ణాటక అటవీశాఖ మంత్రి అమరావతికి వచ్చి ఏపీ ప్రభుత్వంతో సంప్రదింపులు కొనసాగించారు. ఈ చర్చల ఫలితంగా, కుంకీ ఏనుగులను ఏపీకి ఇచ్చేందుకు ఇరు రాష్ట్రాల మధ్య ఒప్పందం కుదిరింది. ఒప్పందం ప్రకారం, ఈరోజు ఐదు కుంకీ ఏనుగులను ఆంధ్రప్రదేశ్‌కు కర్ణాటక ప్రభుత్వం అందించింది. అప్పగింత కార్యక్రమంలో భాగంగా, ఏనుగుల పేర్లతో ప్రత్యేకంగా బోర్డులను కూడా ఏర్పాటు చేయడం విశేష ఆకర్షణగా నిలిచింది. ఈ కుంకీ ఏనుగుల రాకతో, ఏపీలోని ప్రభావిత ప్రాంతాల్లో అడవి ఏనుగుల దాడులను నియంత్రించి, రైతులు, స్థానికులకు రక్షణ కల్పించవచ్చని అధికారులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

# ప్రపంచానికి భారత్ అందిస్తున్న గొప్పవరం యోగా: సీఎం చంద్రబాబు



**అమరావతి, మే 21, జనస్వరం :** ప్రపంచానికి భారతదేశం అందిస్తున్న గొప్ప వరం యోగా అని, యోగా ప్రతి ఒక్కరి జీవితంలో భాగం కావాలని సీఎం చంద్రబాబు అన్నారు. యోగాకు ప్రపంచవ్యాప్త గుర్తింపు తెచ్చిన ఘనత ప్రధాని నరేంద్రమోదీకే దక్కుతుందన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని జూన్ 21న విశాఖలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించే కార్యక్రమానికి ప్రధాని మోదీ హాజరవుతారని చెప్పారు. నేటి నుంచి నెలరోజుల పాటు యోగాంధ్ర-2025 నిర్వహిస్తామన్నారు. జూన్ 21న ఆర్కే బీచ్ నుంచి భోగాపురం వరకూ 5 లక్షలమందితో కార్యక్రమం జరుగుతుందని ముఖ్యమంత్రి తెలిపారు. ఈ సందర్భంగా యోగాంధ్ర వెబ్ సైట్ ను సీఎం చంద్రబాబు ప్రారంభించారు. యోగా అనేది మన దేశానికి వారసత్వంగా వస్తోంది. భారతీయ జీవన విధానంలో ఒక భాగం. దీనికి ప్రపంచవ్యాప్త గుర్తింపు తెచ్చింది ప్రధాని మోదీయే. ఒకప్పుడు ప్రపంచంలో ఎక్కడెక్కడి నుంచో వచ్చి మన దేశంలో చదువుకునేవారు. రానురాను విదేశీ దాడులతో అంతా కనుమరుగైంది. మళ్లీ ఇప్పుడు యోగా విలువ ప్రపంచానికి తెలిసేలా ప్రధాని మోదీ చేశారు. 2014 డిసెంబర్ లో యునైటెడ్ నేషనన్ జనరల్ అసెంబ్లీ ఆమోదించి ప్రపంచమంతా యోగా దినోత్సవం జరపాలని నిర్ణయించింది. యోగా అనేది ఒక ప్రాంతానికో, ఒక మతానికో సంబంధించినది కాదు. మనిషి జీవితంలో మెరుగైన జీవన ప్రమాణాలకు నాంది యోగా. నేటి ఆధునిక యుగంలో అందరూ పరుగులు పెడుతున్నారు. టెక్నాలజీతో ఒత్తిడికి గురవుతున్నారు. ప్రతి దానికీ టెన్షన్ పడుతున్నారు. లైఫ్ మెకానికల్ గా మారుతోంది. వీటన్నింటిని నుంచి ఉపశమనం రావాలంటే యోగా ఒక్కటే మార్గం. రికార్డు సృష్టించేలా నేటి నుంచి నెలరోజుల పాటు యోగాంధ్ర-2025 నిర్వహిస్తాం. ఫోటోల కోసమో, ఈవెంట్ల కోసమే చేసే కార్యక్రమం కాదు. నెల మొత్తం పలు కార్యక్రమాలు నిర్వహించి యోగాపై ప్రతి ఒక్కరిలో చైతన్యం తీసుకురావాలని నిర్ణయించాం. విశాఖ ఆర్కే బీచ్ నుంచి భోగాపురం వరకు 5 లక్షల మందితో ఉదయం 7 నుంచి 8 గంటల వరకు కార్యక్రమం నిర్వహిస్తాం. అదే సమయంలో రాష్ట్ర వ్యాప్తంగా 2 కోట్లమందికి తగ్గకుండా కార్యక్రమంలో పాల్గొనేలా ఏర్పాట్లు చేస్తున్నాం. 10 లక్షలమందితో యోగా కోర్సులు చేయించి వారికి సర్టిఫికెట్లు కూడా అందజేయాలని నిర్ణయించాం. సముద్రం పక్కన ఇలాంటి యోగా నిర్వహించడం అరుదైన విషయం. సముద్ర తీరాన, ప్రకృతి ఒడిలో జరిగే ఈ కార్యక్రమం ఎప్పటికీ గుర్తుండిపోతుంది.

# అయోధ్యలో మరో కీలక ఘట్టం... జూన్ 5న రామ్‌దర్బార్ ప్రాణప్రతిష్ఠ

ఉత్తరప్రదేశ్‌లోని అయోధ్యలో శ్రీరామ మందిర నిర్మాణం తుది దశకు చేరుకుంది. జూన్ 5వ తేదీ నాటికి ఆలయ నిర్మాణ పనులు పూర్తవుతాయని శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ నిర్మాణ కమిటీ ఛైర్మన్ నృపేంద్ర మిశ్రా తెలిపారు. ఈ చారిత్రక ఘట్టానికి గుర్తుగా, జూన్ 3 నుంచి 5వ తేదీ వరకు ఆలయ ప్రాంగణంలో రామ్‌దర్బార్ విగ్రహాల ప్రాణప్రతిష్ఠ మహోత్సవాన్ని నిర్వహించనున్నట్లు ఆయన వెల్లడించారు. ప్రముఖ వార్తా సంస్థ 'పీటీఐ'కి ఇచ్చిన ఒక ఇంటర్వ్యూలో ఆయన ఈ వివరాలను పంచుకున్నారు. జూన్ 5న జరిగే ఈ పవిత్రమైన ప్రతిష్ఠాపన కార్యక్రమానికి వివిధ విశ్వాసాలకు చెందిన ఆధ్యాత్మికవేత్తలను, మత పెద్దలను ఆహ్వానించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. అయితే, ఈ వేడుకకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు చెందిన వీఐపీలను ఆహ్వానించడం లేదని మిశ్రా స్పష్టం చేశారు. సుమారు ఐదు వందల సంవత్సరాల సుదీర్ఘ పోరాటం, నిరీక్షణ అనంతరం ఈ మహత్తర క్షణం ఆసన్నమైందని నృపేంద్ర మిశ్రా వ్యాఖ్యానించారు. రామమందిర నిర్మాణం వెనుక ఎలాంటి రాజకీయ ప్రయోజనాలు గానీ, లక్ష్యాలు గానీ లేవని ఆయన స్పష్టం చేశారు. ఇది పూర్తిగా ఆధ్యాత్మికమైన, చారిత్రకమైన విషయమని అన్నారు. జూన్ 5న రామ్‌దర్బార్ ప్రాణప్రతిష్ఠ కార్యక్రమం ముగిసిన తర్వాత, వారం రోజుల్లో ఆలయంలో నూతనంగా నిర్మించిన భాగాలను భక్తుల దర్శనార్థం అందుబాటులోకి తీసుకురానున్నట్లు మిశ్రా వివరించారు. దీనివల్ల మరింత మంది భక్తులు సౌకర్యవంతంగా దర్శనాలు చేసుకోగలుగుతారని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. అయోధ్యలో బాలరాముడి విగ్రహ ప్రాణప్రతిష్ఠ మహోత్సవాన్ని గత ఏడాది జనవరి 22న అత్యంత వైభవోపేతంగా నిర్వహించిన విషయం తెలిసిందే.



# విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణను తీవ్రంగా వ్యతిరేకించిన వైఎస్ షర్మిల

విశాఖ స్టీల్ ప్లాంట్‌లో కార్మికులను తొలగిస్తూ.. కేంద్ర ప్రభుత్వం ప్లాంట్ అమ్మేస్తుంటే కాంగ్రెస్ పార్టీ చూస్తూ ఊరుకోదని ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల స్పష్టం చేశారు. కార్మికులను తొలగిస్తూ, ప్లాంట్‌ను ప్రైవేటు వ్యక్తులకు అప్పగించేందుకు కేంద్రం కుట్ర పన్నుతోందని, దీనిని కాంగ్రెస్ పార్టీ అడ్డుకుంటుందని తెలిపారు. కార్మికుల హక్కుల పరిరక్షణ కోసం అవసరమైతే ప్రాణత్యాగానికైనా సిద్ధమని ఆమె స్పష్టం చేశారు. 'ఆంధ్రుల హక్కు - విశాఖ ఉక్కు' నినాదాన్ని కాంగ్రెస్ పార్టీ మరోసారి బలంగా వినిపిస్తుందని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ హయాంలోనే స్టీల్ ప్లాంట్ స్థాపించబడిందని, ఆ సమయంలో లాభాల బాటలో నడిచిందని వైఎస్ షర్మిల గుర్తుచేశారు. బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాతే "కుక్కను చంపాలంటే దాన్ని పిచ్చిది చేయాలి" అన్న చందంగా ప్లాంట్‌ను నిర్వీర్యం చేసేందుకు కుట్రలు పన్నుతోందని ఆమె ఆరోపించారు. ఇందులో భాగంగానే ఉద్యోగాలను తొలగించడం, ప్లాంట్‌కు అవసరమైన ముడి సరుకు అందకుండా చేయడం, సొంత గనులు కేటాయించకుండా అడ్డుకోవడం వంటి చర్యలకు పాల్పడుతోందని దుయ్యబట్టారు. కేంద్ర ప్రభుత్వం ప్లాంట్‌ను ఉద్ధరించేందుకు రూ.11 వేల కోట్లు ఇచ్చిందన్న ప్రచారం పూర్తిగా అబద్ధమని, ఇచ్చినట్లే ఇచ్చి అందులోంచి రూ.8 వేల కోట్లను బ్యాంకు రుణాల కింద వెనక్కి తీసుకున్నారని ఆమె వివరించారు. మిగిలిన రూ.3 వేల కోట్లు ఇవ్వాలంటే ఏకంగా 5 వేల మంది ఉద్యోగులను తొలగించాలని షరతు పెట్టారని, ఇది ప్లాంట్‌ను అదానీ వంటి వారికి



కట్టబెట్టే కుట్రలో భాగమేనని షర్మిల ఆరోపించారు. విశాఖ స్టీల్ ప్లాంట్ విషయంలో రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం చోద్యం చూస్తోందని వైఎస్ షర్మిల మండిపడ్డారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ కు ఇది న్యాయంగా ఉందా అని ఆమె ప్రశ్నించారు. "ప్రధాని మోదీకి మీరు ఊడిగం చేస్తున్నారా? కార్మికులను తొలగిస్తుంటే ఎందుకు అడ్డుకోవడం లేదు? మోదీతో లాలూచీ పడ్డారా? లేక ఈ కుట్రలో మీరూ భాగస్వాములా?" అంటూ తీవ్ర వ్యాఖ్యలు చేశారు.

## జీవితం - వి "చిత్రం"




## ఈరోజు పంచాంగం వేళలు

తేదీ : 22 మే 2025
తిథి : శుద్ధి విదియ ( మ : 2.01 వరకు )
నక్షత్రం : ధనిష్ట ( తె 5.52 వరకు )
బ్రహ్మముహూర్తం : తె 5.16 నుండి తె 6.01 వరకు
రాహుకాలం : ఉ 11.08 నుండి మ 12.33 వరకు
యమగండం : మ 3.24 నుండి సా 4.49 వరకు
వర్జ్య కాలం : మ 12.37 నుండి మ 2.17 వరకు

## ఈరోజు నమాజ్ వేళలు

తేదీ : 22 మే 2025
ఫజర్ : 5.35 ఉదయం
సూర్యోదయం : 6.48 ఉదయం
జొహర్ : 12.34 మధ్యాహ్నం
అసర్ : 3.52 సాయంత్రం
మఘ్రిబ్ : 6.19 సాయంత్రం
ఇష : 7.32 సాయంత్రం







## ఎడిటోరియల్

# ప్రజాస్వామ్య పైశాచిక ప్రేత సమాధికి సమయం ఆసన్నమయ్యింది

మన ఓట్లతో గద్దెనెక్కి, ఎన్నో దారుణాలకు ఒడిగట్టి, మళ్లీ ఇలా ఎలా అని ఆశ్చర్యపోతున్నారా? ఇదో ప్రమాదకర రోగం. ప్రజల ఆరోగ్యం, ప్రాణాల గురించి ఏమాత్రం పట్టించుకోకుండా, తానే తయారు చేయించిన నాసిరకం మద్యంను ఎక్కువ ధరకు అంటగట్టి, నోట్లల్లోనే సొమ్ము చేసుకున్నాడు. రాష్ట్ర ప్రజల కష్టార్జితమైన వేల కోట్ల రూపాయలను హోల్సేల్గా కొల్లగొట్టాడు. మన పన్నుల డబ్బుతో తనకోసం ఆకాశాన్నంటే రిషికొండ ప్యాలస్‌ను పెద్ద పెద్ద షాండ్లియర్లు, బాత్ టబ్బులతో వందల కోట్లు వెచ్చించి కళ్లుజిగేల్మనేలా కట్టించుకున్నాడు. మద్యం డబ్బుతో ఏమో.. పొరుగు రాష్ట్రాలలో రియల్ ఎస్టేట్ ఎంపైర్లు నిర్మించాడు. తన 'అవినీతి వికేంద్రీకరణ' అంటాడేమో, ఎంతటి దూరదృష్టి, అద్భుతం కదూ. దీన్ని కేవలం 'అవినీతి' అని ఊరుకుంటే సరిపోదు. ఇది ఒక రకమైన మానసిక రోగం. తన స్వార్థం కోసం ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడే మనస్తత్వం, తనను తాను దేవుడిలా భావించే అహంకారం, ఇతరుల కష్టాన్ని ఏమాత్రం పట్టించుకోని రాక్షసత్వం - ఇవన్నీ కలిసి ఒక భయంకరమైన వ్యాధిలాంటిది. సైకాలజిస్టులు దీన్ని నార్సిసిస్టిక్ పర్సనాలిటీ డిజార్డర్ లేదా యాంటీసోషల్ పర్సనాలిటీ డిజార్డర్ అని పిలుస్తారు. కానీ సామాన్యులుగా మనం అర్థం చేసుకునే భాషలో చెప్పాలంటే, ఇది "నేను ఒక్కడినే గొప్ప, వ్యవస్థలు, ప్రజలంతా నా చెప్పుచేతుల్లో ఉండాలి" అనే పిచ్చి. మరి ఇలాంటి వ్యక్తి, గాడిన పడుతున్న మన వ్యవస్థలోకి లొట్టలు వేసుకొంటూ.. శవాలను లెక్కేసుకొంటూ మళ్లీ వస్తుంటే.. ఏమనాలో అర్థం కావడం లేదు. నిజం చెప్పాలంటే, భూతంలా మరింత రెచ్చిపోతాడు! :



గతంలో చేసిన తన తప్పులకు ఎటువంటి శిక్ష లేకపోతే, దాన్ని కూడా తన గొప్పతనంగా భావిస్తాడు. "నేనేం చేసినా ఈ ప్రజాస్వామ్య దేశంలో చెల్లుతుంది" అనే ధైర్యం వస్తుంది. మనల్ని మరింతగా దోచుకొని, వేధిస్తాడు. మన హక్కులను కాలరాస్తాడు. ప్రజాస్వామ్యం అనే ముసుగులో ఈ కరడగట్టిన నేరస్తుడు మళ్లీ నియంతలా నెత్తికెక్కి వికృత వికటాట్టహాసం చేస్తాడు. మన రాష్ట్ర సంపద సృష్టికి, మన భవిష్యత్తుకు, మన ఆరోగ్యంకు, మన రాష్ట్ర అభివృద్ధికి అడుగడుగునా.. అబద్దాల పెడబొబ్బలతో అడ్డుపడతాడు. "తప్పు చేసినోడు మళ్లీ తప్పు చేస్తాడు. వాడిని నమ్మితే మన బతుకులు నాశనమవుతాయి!" మానవ శవాలకోసం వచ్చిపోతున్న, ఈ విశృంఖల అవినీతి భూతాన్ని రాజకీయంగా సమాధి చెయ్యాల్సిన అత్యవసర పరిస్థితి ఆసన్నమయ్యింది.

## రాజంపేటలో 23న జనసేన పార్టీ క్రియాశీల సభ్యత్వ కిట్ల పంపిణీ

**- ముఖ్య అతిథిగా యల్లటూరు శ్రీనివాస రాజు**

**రాజంపేట, మే 21 (జనస్వరం ప్రత్యేక ప్రతినిధి)** : జనహృదయ నేత, రాజంపేట పార్లమెంటు జనసేన పార్టీ ఇంచార్జ్ యల్లటూరు శ్రీనివాస రాజు ఈ నెల 23న (శుక్రవారం) రాజంపేట పట్టణంలోని జనసేన పార్టీ కార్యాలయం (యల్లటూరు భవన్), మన్నూరు ఎల్లమ్మ దేవాలయం వెనుకనున్న కార్యాలయ ప్రాంగణంలో జరుగనున్న "జనసేన పార్టీ క్రియాశీల సభ్యత్వ కిట్ల పంపిణీ కార్యక్రమం"కు ముఖ్య అతిథిగా హాజరుకానున్నట్లు జనసేన పార్టీ మీడియా కోఆర్డినేటర్ చింతల శివ తెలిపారు. ఈ సందర్భంగా మంగళవారం జరిగిన ఏర్పాట్ల సమీక్షలో రాజంపేట జనసేన నాయకులు యల్లటూరు శివరామరాజు, విశ్రాంత పోలీసు అధికారి కడిమిళ్ళ శ్రీనివాసరాజు, ముమ్మడిరాజు శివ శంకర్ రాజు, కార్యాలయ సిబ్బంది గోవర్ధన్, రామిశెట్టి శ్రీను తదితరులు



పాల్గొని పంపిణీ చేయబోయే కిట్లను పరిశీలించారు. పార్టీ క్రియాశీల కార్యకర్తల ప్రోత్సాహార్థంగా చేపడుతున్న ఈ కార్యక్రమానికి జనసేన పార్టీ నాయకులు, జనసైనికులు, వీరమహిళలు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని చింతల శివ పిలుపునిచ్చారు.

## టంగ్ కాన్సర్‌తో బాధపడుతున్న వ్యక్తికి తిరుపతి అనూష సాయహస్తం

**విజయవాడ, మే 21 (జనస్వరం ప్రత్యేక ప్రతినిధి)** : పశ్చిమ నియోజకవర్గంలోని 45వ డివిజన్‌కి చెందిన గుంటూరు శివ అనే వ్యక్తి టంగ్ కాన్సర్‌తో బాధపడుతున్నారు. తీవ్ర వ్యాధితో పోరాడుతూ ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న శివ, ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ పరిస్థితుల్లో జనసేన పార్టీ నాయకురాలు తిరుపతి అనూషను సంప్రదించగా, ఆమె తన సహృదయతను చాటుతూ వెంటనే స్పందించారు. శివ ఇంటికి స్వయంగా వెళ్లి పరామర్శించిన అనూష, కుటుంబ అవసరాల కోసం పచారి సరుకులు, బియ్యం, పలు రకాల పండ్లు అందించి, ధైర్యంగా ఉండాలని ప్రోత్సహించారు. అంతేకాకుండా, ఆయన పిల్లల స్కూల్ ఫీజులో ఏమైనా పెండింగ్ ఉంటే అది తామే చెల్లిస్తామని హామీ ఇచ్చారు. ఆర్థికంగా నిరుపేదలకు సహాయం చేయాలనే సంకల్పంతో ముందుండే అనూషకు స్థానికంగా ప్రశంసలు అందుకుంది. అనారోగ్యంతో బాధపడుతున్న వ్యక్తికి అండగా నిలిచిన జనసేన నాయకురాలు తిరుపతి. అనూష చర్య, మానవత్వానికి ప్రతిరూపంగా నిలిచింది. ఈ కార్యక్రమంలో 45వ డివిజన్ అధ్యక్షులు, మార్కెట్ యాడ్ డైరెక్టర్ బొమ్ము



గోవిందలక్ష్మి, పశ్చిమ నియోజకవర్గం ఐటీ కోఆర్డినేటర్ మంతాపురం రాజేష్, 44వ డివిజన్ ఉపాధ్యక్షులు కార్తీక్, 43వ డివిజన్ నాయకులు దాసి రామ్మోహన్, కానాల వినోద్ కుమార్, 42వ డివిజన్ నాయకులు తిరుమరెడ్డి గణేష్, ఉడుత్తు మణికంఠ, తదితరులు పాల్గొన్నారు.

# శ్రీశైలక్షేత్రానికి భద్రతా అధికారి కరువు

**- అర్హతా, అనుభవంలేని సిఎస్ వోలే దిక్కు**
**- శ్రీశైలం ఆలయ భద్రతపై పర్యవేక్షణ లోపాలెన్నో?**
**- తరచుగా ఎదురవుతున్న వైఫల్యాలు**


**శ్రీశైలం, మే 21 (జనస్వరం)** : దక్షిణ భారతదేశంలో తిరుమల తిరుపతి దేవస్థానం తర్వాత అంతటి ప్రాధాన్యత కలిగిన మహాపుణ్యక్షేత్రం శ్రీశైలం. ద్వాదశ జ్యోతిర్లింగం, అష్టాదశ శక్తిపీఠం కలవేలసిఉన్న శ్రీశైలమహాక్షేత్రానికి అనునిత్యం భక్తుల తాకిడి అధికంగా ఉంటుంది. ఈ క్రమంలో శ్రీశైలదేవస్థానం ఆలయ భద్రతా చర్యల్లో భాగంగా సాంకేతిక నిఘాతో పాటుగా భద్రతా సిబ్బంది సైతం వందల సంఖ్యలో ఏర్పాటు చేసింది. అయితే భద్రతా పర్యవేక్షణపై అర్హత, అనుభవం గల అధికారిని నియమించడంలో అధికారయంత్రాంగం విఫలమౌతుందన్న విమర్శలు ఉన్నాయి. శ్రీశైలక్షేత్ర భద్రతపై అన్నిరకాల చర్యలు తీసుకుంటున్న దేవస్థానం.. ఆలయభద్రతా విధివిధానాలను పర్యవేక్షించే విషయంలో అన్ని అర్హతలు, అనుభవంతో కూడిన చీఫ్ సెక్యూరిటీ అధికారిని నియమించడంలో మీనమేషాలు లెక్కిస్తుందన్న విమర్శలు వ్యక్తమౌతున్నాయి. శ్రీశైలదేవస్థానంలో విధులు నిర్వహిస్తున్న పర్యవేక్షకుడి స్థాయి అధికారికి శ్రీశైలదేవస్థానం ముఖ్యభద్రాతా అధికారిగా బాధ్యతలు అప్పగిస్తూ కాలం గడుపుతుండటం గమనార్హం. ఈ క్రమంలో చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్ స్థాయికి తగిన అర్హతా, అనుభవం లేని అధికారులు శ్రీశైలక్షేత్ర భద్రత పర్యవేక్షణలో ఆశించిన స్థాయిలో రాణించలేకపోతున్నారనడంలో ఎలాంటి సందేహం లేదు. తాజాగా ప్రస్తుత భద్రతా అధికారి క్షేత్రాభద్రతా విషయంలో నిర్లక్ష్యం వహించారన్న కోణంలో దేవస్థానం కార్యనిర్వాహణాధికారి సదరు అధికారిని సస్పెండ్ చేసిన విషయం తెలిసిందే. దేవస్థానంలోని ఆయా విభాగాల్లోని విధులు నిర్వహిస్తున్న పర్యవేక్షణాధికారులకే అదనంగా క్షేత్రాభద్రత పర్యవేక్షణ బాధ్యతలు అప్పగిస్తుండటంతో విధినిర్వహణకు సరైన న్యాయం చేయలేని పరిస్థితులు ఎదురావుతున్నాయన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. శ్రీశైలదేవస్థానానికి పోలీసు శాఖ పరిధిలోని డిఎస్పీ స్థాయి అధికారిని చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్ గా నియమించాలన్న ప్రతిపాదన ఉన్నా... నేటికి ఆచరణకు నోచుకోలేదు. గతంలో రిటైర్డు డిఎస్పీ, రిటైర్డు సీఐ స్థాయి అధికారులను నియమించినా.. సదరు అధికారులు ఎక్కువ కాలం విధుల్లో నిలువలేకపోయారు. ఫలితంగా ఆలయ భద్రత పర్యవేక్షణ విషయంలో అర్హతా, అనుభవం లేని భద్రతా అధికారులే



దిక్కవుతున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. క్షేత్రంలో వందల సంఖ్యలో సీసీ కెమెరాలు, వందల సంఖ్యలో భద్రతా సిబ్బంది పని చేస్తున్నా.. భద్రతా చర్యలను పర్యవేక్షించేందుకు సరైనభద్రతా అధికారి లేకపోవడం సర్వత్రా ఆందోళన కలిగించే అంశం. శ్రీశైలక్షేత్రానికి సాధారణ రోజుల్లో 30-40వేల మంది భక్తులు, శని, ఆది, సోమవారాలు, సెలవు దినాల్లో 50 నుంచి లక్ష మంది భక్తులు, బ్రహ్మోత్సవాలు, మహోత్సవ రోజుల్లో లక్షల సంఖ్యలో భక్తులు శ్రీశైలం వస్తుంటారు. ఈ నేపథ్యంలో క్షేత్రాభద్రత పర్యవేక్షణ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం స్పందించి అర్హతా, అనుభవం గల చీఫ్ సెక్యూరిటీ అధికారిని నియమించాలని భక్తులు కోరుతున్నారు.

## శ్రీశైలం డ్యాంలో కొనసాగుతున్న శాస్త్రవేత్తల పరిశోధన

**శ్రీశైలం, మే 21 (జనస్వరం)** : శ్రీశైలం డ్యాం పరిసరాలను బుధవారం పూణేకు చెందిన సెంట్రల్ వాటర్ పవర్ రీసెర్చ్ స్టేషన్ (CWPRS) శాస్త్రవేత్తలు పరిశీలించారు. ముందుగా వ్యూపాయింట్ వద్ద డ్యామ్ అధికారులతో సమీక్ష నిర్వహించిన బృందం, ప్లాంజ్ పూల్, గ్యాలరీ, గేట్లు, సిలిండర్లను నిక్షిప్తంగా పరిశీలించింది. శాస్త్రవేత్తలకు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరాలు అందించగా, వారు రెండు రోజులు డ్యామ్ లోతు, నిర్మాణ సాంకేతికతపై అధ్యయనం చేయనున్నారని తెలిపారు. ఇందులో భాగంగా బుధవారం ఉదయం శ్రీశైలం డ్యామ్ వెనుకభాగాన పడవలో తిరుగుతూజలాశయం నీటి నిల్వలు, తదితర అంశాలపై పరిశీలిస్తున్నారు. ఈ పర్యవేక్షణలో పూణే శాస్త్రవేత్తలు హనుమంతప్ప, సంజయ్ బూరెలే, మహావీర్ సింగ్, డాక్టర్ నాయుడు, సునీల్ పాల్గొన్నారు.





## కోరుకొండ రహదారికి మరమ్మత్తు పనులు చేపట్టండి

**- వర్షాలతో దెబ్బతిన్న రహదారి**
**- వాహనదారుల గుండెలో దిట్లీ**
**- కోటగున్నల ప్రజల ఆందోళన**

**చింతపల్లి, మే 21 (జనస్వరం)** : మండలంలోని లోతు గడ్డ వంతెన నుంచి కోటగున్నల, నిమ్మపాడు మీదుగా కోరుకొండ వెళ్లే ప్రధాన రహదారి తీవ్రంగా దెబ్బతిన్న నేపథ్యంలో స్థానికులు బుధవారం ఉదయం పెద్దఎత్తున రోడ్డుపై నిరసనకు దిగారు. ఇటీవల కురిసిన భారీ వర్షాల ప్రభావంతో లోతుగడ్డ వంతెన నుంచి కోరుకొండ వరకు రహదారి పూర్తిగా శిథిల వ్యవస్థకు చేరి చిత్తడిగా మారడంతో ప్రజలు, వాహనదారులు తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వాహనాల రాకపోకలకు ఈ దారి అసలు ఉపయోగపడని స్థితికి చేరిందని, అత్యవసర పరిస్థితుల్లో రోగులు, గర్భిణీలను సమీపంలోని ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లడం సవాలుగా మారిందని గ్రామస్థులు వాపోతున్నారు. ఈ నేపథ్యంలో, కోటగున్నల వద్ద రహదారి మరమ్మత్తు పనులు చేపట్టాలని డిమాండ్



చేస్తూ పెద్ద సంఖ్యలో ప్రజలు నిరసన చేపట్టారు. ప్రజాప్రతినిధులు, జిల్లా ఉన్నతాధికారులు తక్షణం స్పందించి రహదారి మరమ్మతులు చేపట్టకపోతే ఆందోళనలు తీవ్రరూపం దాల్చుతాయని గ్రామస్థులు హెచ్చరించారు. చిన్నపాటి వర్షాలకే రహదారి వాడుకకు లేకుండా పోతే, రాబోయే వర్షాకాలంలో పరిస్థితి ఎలా ఉంటుందో ఊహించలేమని ఆందోళన వ్యక్తం చేశారు. రాజకీయ నాయకులు, అధికారులు ప్రజల వేదుకల పట్ల స్పందించి వెంటనే చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు. ప్రభుత్వం ఈ సమస్యను ఉదాసీనంగా చూసినట్లయితే, పెద్దఎత్తున ఉద్యమానికి సిద్ధమవుతామని వారు హెచ్చరించారు.

## లోతుగడ్డ - చెరుకుంపాకల ప్రధాన రహదారిపై పశువుల సంచారం

**- పట్టించుకోని యజమానులు**
**- రాత్రిళ్లు రోడ్డుపైనే నిద్రించే పశువులు**
**- వాహనదారులకు ముప్పు**

**చింతపల్లి, మే 21 (జనస్వరం)** : చింతపల్లి – పాడేరు ప్రధాన రహదారి మార్గంలోని చెరుకుంపాకలు, లోతుగడ్డ గ్రామాలలో



రోడ్డుపై పశువుల సంచారం భారీగా పెరిగిపోయింది. ఈ ప్రాంతాల్లో రాత్రి వేళల్లో పశువులు రహదారులపై నిద్రించడమే కాకుండా స్వేచ్ఛగా తిరుగుతూ వాహనదారులకు తీవ్ర అంతరాయంగా మారుతున్నాయి. పశువుల యజమానులు వాటిని వదిలేసి నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండటంతో, ప్రతి రోజూ వాహనదారులు ప్రమాదాలకు గురయ్యే పరిస్థితి ఏర్పడుతోంది. ముఖ్యంగా చీకటి సమయాల్లో కాంతిలేని ప్రాంతాల్లో ఈ పరిస్థితి మరింత తీవ్రంగా మారుతోంది. ఈ పరిస్థితిపై ఆందోళన వ్యక్తం చేస్తున్న ప్రయాణికులు, వాహనదారులు పశు సంరక్షణ శాఖ అధికారులు తక్షణమే జోక్యం చేసుకుని పశువులను గోశాలలో ఉంచే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. ప్రజల ప్రాణాలకు ముప్పుగా మారుతున్న ఈ పరిస్థితికి సంబంధించి సంబంధిత శాఖలు గట్టి చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

## జీవవైవిధ్య రక్షక్ అవార్డు ఎంపిక

**- నేడు సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ చేతుల మీదుగా అవార్డు ప్రధానం**

**చింతపల్లి, మే 21 (జనస్వరం)** : గిరిజన వికాస్ స్వచ్ఛంద సేవ సంస్థ వ్యవస్థాపకుడు, కార్యదర్శి నెల్లూరి వెంకట సత్యనారాయణ జీవవైవిధ్య రక్షక్ అవార్డుకు ఎంపికయ్యారు. ఆంధ్రప్రదేశ్ బయోడైవర్సిటీ బోర్డు ఇచ్చే ఈ ప్రతిష్టాత్మక అవార్డు అల్లూరి జిల్లాలోని మన్యం ప్రాంతాల్లో జీవవైవిధ్య పరిరక్షణకు చేసిన కృషికి గుర్తింపుగా లభించింది. మే 22న విజయవాడలో జరిగే ప్రపంచ జీవవైవిధ్య



దినోత్సవ వేడుకల్లో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ చేతుల మీదుగా సత్యనారాయణ ఈ అవార్డును స్వీకరించనున్నారు. గత రెండు దశాబ్దాలుగా చింతపల్లి, జీకేవీధి, కోయ్యూరు మండలాల్లో గిరిజనుల జీవనోపాధి, సహజ వ్యవసాయం, సేంద్రీయ విధానాల పరిరక్షణ కోసం ఆయన విశేషంగా సేవలందించారు. నాబార్డు మాతోట పథకం ద్వారా వందలాది ఎకరాల్లో తోటల అభివృద్ధి, గిరిజన విద్యార్థులలో అవగాహన కార్యక్రమాలు, సేంద్రీయ ధ్రువీకరణతో కాఫీకి బ్రాండింగ్ కల్పించడం తదితర రంగాల్లో కృషి చేశారు. ఈ గుర్తింపు తమ సంస్థ ప్రయాణానికి ప్రేరణగా నిలుస్తుందని వెంకట సత్యనారాయణ పేర్కొన్నారు.

## కేసీఆర్, హరీష్ రావులకు నోటీసులపై నగేష్ ముదిరాజ్ మండిపాటు

**హైదరాబాద్, మే 22 (జనస్వరం)** : సీఎం రేవంత్ రెడ్డి పాలన వైఫల్యాన్ని కప్పి పుచ్చుకోవడానికే మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రి హరీష్ రావులకు నోటీసులు జారీ చేస్తున్నారని బీఆర్ఎస్ నేత నగేష్ ముదిరాజ్ ఆరోపించారు. ముషీరాబాద్, రాంనగర్ ప్రాంతాల నుంచి పార్టీ రాష్ట్ర స్థాయి నేతగా ఉన్న ఆయన మీడియా సమావేశంలో సంచలన వ్యాఖ్యలు చేశారు. "నోటీసులకు తాటాకు చప్పుళ్లకు భయపడేది లేదు. భయపడి ఉండే వాళ్లు అయితే అప్పటి ఆంధ్ర పాలకులతో, ఢిల్లీ పాలకులతో తెలంగాణ రాష్ట్రం సాధించగలిగేవారా?" నగేష్ ముదిరాజ్ అని ప్రశ్నించారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల సమస్యలపై దృష్టి పెట్టాల్సిన సమయంలో, అసలైన అంశాలనుంచి దృష్టి మళ్లించేందుకు నోటీసుల రాజకీయాలు చేస్తున్నారని విమర్శించారు. "సూట్‌కేసులు ఢిల్లీకి మోయడం తప్ప ప్రజల పాలన గాడితప్పింది. రాష్ట్రం పాలనలో అసంతృప్తి ఉంది. ఆందోళన వ్యక్తమవుతోంది," అని వ్యాఖ్యానించారు. ఇకపై ప్రజల బాధలు పట్టించుకోకుండా మిస్ వరల్డ్, ఇతర కళాప్రదర్శనల వెనక మంత్రుల కాన్వాయ్‌లు తిరుగుతున్నాయన్న నగేష్ ముదిరాజ్, ఇది పాలన కాదని తీవ్రంగా విరుచుకుపడ్డారు. పాలన చేయలేకపోతే సీఎం రేవంత్ రెడ్డి తక్షణమే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.



## భాగవత సప్తాహం - మోక్ష ప్రాప్తికి మార్గం

**- మాజీ రాజ్యసభ సభ్యులు తులసి రెడ్డి**

**పులివెందుల, మే 21 (జనస్వరం)** : భాగవత సప్తాహం మోక్ష ప్రాప్తికి మార్గమని రాజ్య సభ మాజీ సభ్యులు, ప్రముఖ ఆధ్యాత్మిక వేత్త డాక్టర్ నర్రెడ్డి తులసి రెడ్డి అన్నారు. బుధవారం తొండూర్ మండలం, అగుడూరు శ్రీ కోదండ రామ స్వామి దేవాలయంలో జరిగిన భాగవత సప్తాహం కార్యక్రమంలో తులసి రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా తులసి రెడ్డి మాట్లాడుతూ ఆధునిక మానవుడు అన్నీ వుండి కూడా అశాంతితో అలమటిస్తున్నాడన్నారు. ఈ పరిస్థితిలో భాగవత సప్తాహం లాంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు మానవునికి ప్రశాంతతను కలిగిస్తాయన్నారు. శ్రీమన్నారాయణుని అవతార లీలా గాథా వైభవమే శ్రీ మద్ భాగవతం అన్నారు. ప్రహ్లాదుడు, ధ్రువుడు, అంబరీషుడు, ముచికుందుడు తదితర భక్తుల గాథల ద్వారా ఆధ్యాత్మిక జ్ఞానాన్ని ప్రసాధించే మోక్ష శాస్త్రమే భాగవతం అని వివరించారు. కార్యక్రమంలో భాగవతులు బాలకృష్ణా రెడ్డి, చంద్ర మౌలీశ్వర్ రెడ్డి, రఘురామి రెడ్డి,సుధాకర్ రెడ్డి, అమర్ నాథ్ రెడ్డి, ఉత్తన్న, నాగ రాజు, వినయ్ తదితరులు పాల్గొన్నారు.



## నెక్స్టసెల్ ఇండియా – డిక్సన్ టెక్నాలజీస్ అనుబంధ సంస్థతో కాంట్రాక్ట్ మాన్యుఫ్యాక్చరింగ్ ఒప్పందం

**హైదరాబాద్, మే 21 (జనస్వరం) :** నెక్స్టసెల్ ఇండియా, 100 శాతం దేశీయ సంస్థగా గుర్తింపు పొందిన టెక్ కంపెనీ, డిక్సన్ టెక్నాలజీస్ (ఇండియా) లిమిటెడ్ కు చెందిన అనుబంధ సంస్థ ప్యాడ్జెట్ ఎలక్ట్రానిక్స్ ప్రైవేట్ లిమిటెడ్ తో వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని ఏర్పరుచుకుంది. ఈ ఒప్పందం ద్వారా ప్రసిద్ధ ఫ్రెంచ్ బ్రాండ్ ఆల్కాటెల్ స్మార్ట్‌ఫోన్లను భారత్‌లో తయారు చేసి, మళ్లీ మార్కెట్లోకి ప్రవేశపెట్టే పనిలో నిమగ్నమయ్యారు. ఈ భాగస్వామ్యం భారత డిజిటల్ తయారీ రంగంలో ఒక కీలకమైన దశగా భావించబడుతోంది. ఆల్కాటెల్ డిజైన్ వారసత్వం, ప్యాడ్జెట్ ఎలక్ట్రానిక్స్ అద్భుత తయారీ నైపుణ్యం కలిసొచ్చి భారతీయ వినియోగదారులకు ప్రీమియం ప్రమాణాల టెక్నాలజీని అందించనుంది. ప్యాడ్జెట్ ఆధునిక తయారీ యూనిట్లు, ఆటోమేషన్, ఏఐ ఆధారిత నాణ్యతా నియంత్రణ, స్థిరమైన ఆపరేషన్లతో దేశీయ వినియోగంతో పాటు గ్లోబల్ ఎగుమతులకూ అనుకూలంగా పనిచేస్తాయన్నారు నిర్వాహకులు. ఈ ఒప్పందం సందర్భంగా నెక్స్టసెల్ ఇండియా సీఓఓ అంశ్ రాథీ మాట్లాడుతూ "ప్యాడ్జెట్ ఎలక్ట్రానిక్స్‌తో మా భాగస్వామ్యం, 'మేక్ ఇన్ ఇండియా' దిశగా మేము తీసుకున్న గట్టి అడుగుగా భావిస్తున్నాం. మొదటి విడత నుంచే ఆల్కాటెల్ స్మార్ట్‌ఫోన్లలో మా పేటెంట్ పొందిన డిస్ప్లే టెక్నాలజీని ప్రవేశపెట్టడం మాకు గర్వకారణం," అన్నారు. నెక్స్టసెల్ వ్యవస్థాపకుడు మరియు డైరెక్టర్ సంజీవ్ రాథీ మాట్లాడుతూ "ప్యాడ్జెట్ ఎలక్ట్రానిక్స్ వంటి పరిశ్రమ నాయకులతో చేతులు కలపడం గర్వకారణం. భారత స్మార్ట్‌ఫోన్ మార్కెట్‌లో నూతన ప్రమాణాలు స్థాపించాలనే లక్ష్యంతో ఈ ప్రయాణం మొదలైంది. తయారీ నైపుణ్యం మరియు మార్కెట్ అవగాహన కలిసినప్పుడే టెక్నాలజీ అందరికీ చేరుతుంది,"



అని చెప్పారు. ఈ భాగస్వామ్యం ద్వారా ఆల్కాటెల్ స్మార్ట్‌ఫోన్ల కొత్త అధ్యాయం భారతీయ వినియోగదారులకు అందుబాటులోకి రానుంది.

## రాజీవ్ గాంధీ గొప్ప దార్శనికుడు

**పులివెందుల మే 21 (జనస్వరం) :** కాంగ్రెస్ పార్టీ మాజీ జాతీయ అధ్యక్షుడు, మాజీ భారత ప్రధాని,భారత రత్న స్వర్గీయ రాజీవ్ గాంధీ గొప్ప దార్శనికుడు, రాజనీతిజ్ఞుడు అని రాజ్య సభ మాజీ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ముఖ్య అధికార ప్రతినిధి డాక్టర్ ఎన్ తులసిరెడ్డి కీర్తించారు. బుధవారం వేంపల్లిలో కాంగ్రెస్ నాయకులు రాజీవ్ గాంధీ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తులసి రెడ్డి మాట్లాడుతూ 1985 నుంచి 1991 వరకు 6 సంవత్సరాల పాటు ఏఐసీసీ అధ్యక్షులుగా, 1984 నుంచి 1989 వరకు 5 ఏళ్ల పాటు భారత ప్రధానిగా అటు కాంగ్రెస్ పార్టీకి, ఇటు దేశానికి రాజీవ్ ఎనలేని సేవ చేశారన్నారు. జాతి నిర్మాణంలో యువతకు ఎక్కువ ప్రాధాన్యత కల్పించాలన్న ఉద్దేశంతో ఓటు కనిష్ట వయో పరిమితిని 21 ఏండ్ల నుంచి 28 ఏండ్లకు తగ్గించిన యువత పక్షపాతి రాజీవ్ అన్నారు. స్థానిక సంస్థలలో మహిళలకు రిజర్వేషన్లు కల్పించి మహిళా సాధికారితకు కృషి చేసిన మహిళా పక్షపాతి అన్నారు. 73, 74 రాజ్యాంగ సవరణల ద్వారా స్థానిక సంస్థల కు రాజ్యాంగ ప్రతిపత్తి కల్పించి పూజ్య బాపూజీ కలలుగన్న గ్రామ స్వరాజ్యానికి బాటలు వేసిన దార్శనికుడు రాజీవ్ అని తులసి రెడ్డి కీర్తించారు. దేశంలో ఎలెక్ట్రానిక్ , సమాచార విప్లవానికి ఆద్యుడు రాజీవ్ గాంధీ అనిఅన్నారు. 1991 మే 21 lన తమిళనాడులోని శ్రీ పెరంబదూర్ వద్ద ఉగ్రవాదుల దురాగతానికి రాజీవ్ గాంధీ బలై పోయారని, అందుకే మే 21ని ఉగ్రవాద వ్యతిరేక దినంగా జరుపుకుంటున్నామని తులసి రెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు డాక్టర్ సుబ్రమణ్యం, వేంపల్లి మండల శాఖ అధ్యక్షుడు రామ కృష్ణ, వేముల మండల శాఖ అధ్యక్షుడు వెంకటేష్, పెండ్లి మర్రి మండల శాఖ



అధ్యక్షుడు మహబూబ్ బాషా, చక్రాయపేట మండల శాఖ అధ్యక్షుడు రామాంజనేయ రెడ్డి, అమర్ నాథ్ రెడ్డి, ఉత్తన్న,నాగరాజు, రమణ, వినయ్, బద్రి, వేమయ్య, వేమా రాజా, మదార్, రవి, సాయి, చందూ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ఉంగుటూరు ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు జన్మదిన వేడుకలు

**- నూతన క్యాంపు కార్యాలయంలో ప్రజా నాయకుడికి ఘన స్వాగతం**

**ఉంగుటూరు, మే 21 (జనస్వరం ప్రత్యేక ప్రతినిధి)** : ఉంగుటూరు నియోజకవర్గ ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు జన్మదిన వేడుకలు బుధవారం మండలంలోని నారాయణపురం గ్రామంలోని నూతన క్యాంపు కార్యాలయ ఆవరణలో ఘనంగా నిర్వహించారు. వేలాదిగా తరలి వచ్చిన కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలు, ప్రజా ప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, స్థానిక ప్రజలు ఎమ్మెల్యేకి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఏపీసీఓబీ ఛైర్మన్, ఏలూరు జిల్లా టీడీపీ అధ్యక్షులు గన్ని వీరాంజనేయులు, ఇతర కూటమి నేతల సమక్షంలో ఎమ్మెల్యే పత్తేపురం గ్రామానికి చెందిన పొత్తూరి హరి వేణు గోపాల్ రాజు, పొత్తూరి గణేష్ వర్మ ఏర్పాటు చేసిన 300 కేజీల భారీ కేక్‌ను కట్ చేశారు. వేడుకల సందర్భంగా వివిధ మండలాల నుండి వచ్చిన పార్టీ శ్రేణులు పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేసి, కేక్ కట్ చేస్తూ తమ అభిమానాన్ని వ్యక్తపరిచారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు మాట్లాడుతూ, "నా జన్మదినాన మీరు చూపిన ప్రేమ, ఆదరణకి హృదయపూర్వక కృతజ్ఞతలు. ఈ ఆశీస్సులు నాకు ప్రజలకు సేవ చేసే మార్గంలో మరింత శక్తిని అందిస్తున్నాయి" అని పేర్కొన్నారు.



## ధనకడ్ వ్యాఖ్యలు ఆక్షేపణీయం : కే.సంజయ్ కుమార్

**నెల్లూరు, మే 21 (జనస్వరం) :** అత్యున్నత న్యాయవ్యవస్థ పై అనుమానాలు కలిగే విధంగా ఉపరాష్ట్రపతి ధనకడ్, రాజ్యాంగ బద్ధమైన ఉన్నత పదవిలో ఉండి సుప్రీంకోర్టు నియమించిన న్యాయమూర్తులు కమిటీకి చట్టబద్ధత లేదని వ్యాఖ్యానించడం, న్యాయవ్యవస్థలో తిమింగలాలు ఉన్నాయని పేర్కొనడం బాధ్యతా రహితమని కాంగ్రెస్ సిటీ ఉపాధ్యక్షుడు అడ్వకేట్ కే. సంజయ్ కుమార్ అన్నారు. బిజెపి ప్రభుత్వంలో కొంతమంది గవర్నర్లు, ఉపరాష్ట్రపతి ఆ పార్టీ కార్యకర్తల్లాగా వ్యవహరిస్తున్నారని, స్వయాన న్యాయవాది అయిన ధనకడ్ న్యాయవ్యవస్థపై బురద జల్లడం ఎంతవరకు సమంజసమన్నారు. సామాన్యులకు భరోసాగా, దేశంలో న్యాయం ఇంకా బ్రతికి ఉంది అనేదానికి ప్రతీకగా ఉన్న భారత న్యాయవ్యవస్థనే కించపరిచే విధంగా న్యాయ వ్యవస్థపై నమ్మకం కోల్పోయే విధంగా ఉపరాష్ట్రపతి ధనకడ్ ప్రవర్తించడం శోభస్కరం కాదని సంజయ్ అన్నారు. ధనఖడ్ న్యాయవ్యవస్థలో తిమింగలాలు అని పేర్కొనడం రాజ్యాంగ వ్యవస్థలపై దాడిగా పరిగణించాలని, పౌరుని ప్రాథమిక హక్కులు కాపాడుతూ,రాజ్యాంగ మౌలిక సూత్రానికి విఘాతం కలగకుండా ఎంతోమంది జడ్జీల ద్వారా అత్యున్నత తీర్పులు అందించిన ఘనత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ అందించిన రాజ్యాంగము, భారత న్యాయవ్యవస్థ సొంతమని , అటువంటి న్యాయవ్యవస్థ పైన లేనిపోని అభాండాలు వేయడం బిజెపి ప్రభుత్వానికి అలవాటై పోయిందని మోడీ మెప్పు కోసమే ధన ఖడ్ ఇలాంటి వ్యాఖ్యలు చేస్తున్నారని, రాబోయే రోజుల్లో మోడీకి ప్రజలు తగిన బుద్ధి చెప్తారని పేర్కొన్నారు.



కార్యక్రమంలో అడ్వకేట్ సుధీర్, రూరల్ కాంగ్రెస్ నాయకులు మల్లికార్జున్ రెడ్డి, అడ్వకేట్ సుధాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు

## పసుపుమయంగా పుట్టపర్తి

**- అట్టహాసంగా టీడీపీ మినీ మహానాడు**

**పుట్టపర్తి, మే 21 (జనస్వరం ప్రత్యేక ప్రతినిధి) :** నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ నిర్వహించిన మినీ మహానాడు అట్టహాసంగా, పసుపుమయంగా సాగింది. ప్రజాసంక్షేమం, అభివృద్ధి లక్ష్యంగా నిర్వహించిన ఈ సభలో ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి, మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి పాల్గొని పార్టీ కార్యకర్తలకు ఉత్సాహం నింపారు. సభ ప్రారంభంలో టీడీపీ సంస్థాపకుడు నందమూరి తారకరామారావు విగ్రహానికి నేతలు పుష్పాంజలి అర్పించారు. అనంతరం పార్టీ జెండాను ఆవిష్కరించి జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి మాట్లాడుతూ, పుట్టపర్తి నియోజకవర్గ అభివృద్ధే తన అజెండా అని స్పష్టం చేశారు. రాబోయే మూడేళ్లలో నియోజకవర్గంలోని 193 చెరువులను నింపి, రెండు రిజర్వాయర్లతో కృష్ణా జిల్లాలో నుంచి నీటిని తరలించి ఈ ప్రాంతాన్ని హార్టికల్చర్ హబ్‌గా అభివృద్ధి చేస్తామని తెలిపారు. ప్రజలకు శాశ్వతంగా శుద్ధ త్రాగునీరు అందించేందుకు తాను కట్టుబడి ఉన్నట్లు చెప్పారు. ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్‌తో ప్రత్యేకంగా చర్చించి పరిశ్రమలు తీసుకురావడం ద్వారా యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తామని చెప్పారు. పుట్టపర్తికి జూనియర్ కళాశాల, ప్రభుత్వ ఆసుపత్రి ఏర్పాటు చేయడంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తోడుగా ఉంటారని వెల్లడించారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను తప్పకుండా నెరవేర్చుతానని హామీ ఇచ్చారు. మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి మాట్లాడుతూ, ఎన్టీఆర్ పేదల సంక్షేమానికి బాటలు వేసి తెలుగుదేశం పార్టీని స్థాపించారని, ఆ మార్గంలో సీఎం చంద్రబాబు అభివృద్ధి పరంగా దిశానిర్దేశం చేస్తున్నారని అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రాష్ట్ర అభివృద్ధి పునరుజ్జీవనాన్ని ప్రారంభించిందని పేర్కొన్నారు. చంద్రబాబు వంటి మచ్చలేని పాలకుడు దేశంలో అరుదైన వాడు అని, ఆయనకు ప్రధాని మోదీ తరువాతే ప్రజాదరణ ఉందని ప్రశంసించారు. వైసీపీ పాలనలో తెలుగుదేశం కార్యకర్తలపై అక్రమ కేసులు బనాయించి వేధించారని ఆరోపించారు. "నాతో సహా మా నియోజకవర్గంలో



ఎంతోమంది కార్యకర్తలు ఆ దుర్మార్గ పాలనకు బలయ్యారు. కానీ ఇప్పుడు ప్రజలు నమ్మిన తీర్పు వెలువరించారు," అన్నారు. గత 30 ఏళ్లుగా మా కుటుంబానికి మీరు చూపిన మద్దతే మా శక్తి అన్నారు. ఎలాంటి కష్టాలు వచ్చినా ప్రజలను కుటుంబ సభ్యుల్లా భావించి నిలబడతానని హామీ ఇచ్చారు. సభలో నియోజకవర్గ అభివృద్ధిపై పలు తీర్మానాలు చేయబడ్డాయి. బుక్కపట్నం చెరువు ముంపు కారణంగా నష్టపోయిన రైతులకు పరిహారం అందించే చర్యలు, బుక్కపట్నం డిగ్రీ కళాశాల అభివృద్ధి, పాలిటెక్నిక్ కళాశాల స్థాపన, ఆరు మండలాలకు సురక్షిత త్రాగునీటి పథకాలు వంటి అంశాలపై ప్రతిజ్ఞ చేశారు. మాజీ ఎమ్మెల్సీ బచ్చల పుల్లయ్య మాట్లాడుతూ, టీడీపీ అధికారంలోకి వస్తే రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తామనేది చంద్రబాబు లక్ష్యం అయితే, జగన్ మాత్రం రాష్ట్రాన్ని అప్పుల ఊబిలో నెట్టాడని విమర్శించారు. కూటమి ప్రభుత్వం "మన మిత్ర" అనే వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా ప్రజలకు సేవలను తక్షణమే అందజేస్తోందని చెప్పారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర, జిల్లా స్థాయి నాయకులు, ఆరు మండలాల కన్వీనర్లు, సీనియర్ నాయకులు, యువత, మహిళా కార్యకర్తలు, రైతు నాయకులు తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. మినీ మహానాడు పుట్టపర్తి ప్రజలకు అభివృద్ధి సంకల్పాన్ని చాటే ప్రేరణాత్మక వేదికగా నిలిచింది.

## రాజీవ్ గాంధీ సాంకేతిక విప్లవ పితామహుడు

**- సిటీ కాంగ్రెస్ ఉపాధ్యక్షులు కే.సంజయ్ కుమార్**

**నెల్లూరు, మే 21 (జనస్వరం) :** మాజీ ప్రధానమంత్రి రాజీవ్ గాంధీ వర్ధంతి పురస్కరించుకొని సిటీ కాంగ్రెస్ అధ్యక్షుడు నారపరెడ్డి కిరణ్ కుమార్ రెడ్డి ఆదేశాల మేరకు బుధవారం సిటీ కాంగ్రెస్ ఉపాధ్యక్షులు కే సంజయ్ కుమార్ ఆధ్వర్యంలో నివాళులర్పించారు. స్టేడియం ఎదురుగా ఉన్న రాజీవ్ గాంధీ విగ్రహానికి పూలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సిటీ కాంగ్రెస్ ఉపాధ్యక్షులు కే సంజయ్ కుమార్ మాట్లాడుతూ సాంకేతిక విప్లవ పితామహుడుగా రాజీవ్ గాంధీ సేవలు అజరామరణమని, టెలి కమ్యూనికేషన్ కంప్యూటర్ రంగాన్ని కొత్త పుంతలు తొక్కిచ్చాడని, దేశం కోసం ప్రాణాలర్పించిన రాజీవ్ గాంధీ గొప్ప విదేశాంగ విధానాన్ని అనుసరించాడని, ఓటు హక్కు 21 సంవత్సరం నుండి 18 సంవత్సరాలకు తీసుకువచ్చాడని, స్థానిక సంస్థల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించిన ఘనత రాజీవ్ గాంధీ సొంతమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో రూరల్ కాంగ్రెస్ నాయకులు వై మల్లికార్జున్ రెడ్డి. సిటీ ఉపాధ్యక్షుడు ఇర్ఫాన్, సేవాదళ్ సుజాత, జనరల్ సెక్రెటరీ సుధీర్, ధనుంజయ్, సమీర్ తదితరులు పాల్గొన్నారు



## జనస్వరం తెలంగాణ

www.janaswaram.com

## వైభవంగా కాంగ్రెస్ మహిళా అధ్యక్షురాలు విమలాదేవి పుట్టినరోజు సంబరాలు

**హైదరాబాద్, మే 21 (జనస్వరం) :** హైదర్‌నగర్ డివిజన్ కాంగ్రెస్ మహిళా అధ్యక్షురాలు విమలాదేవి పుట్టినరోజు వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ నివాసంలో ఆమెకు శుభాకాంక్షలు తెలియజేసారు. ఎమ్మెల్యే గాంధీ సమక్షంలో కేక్ కట్ చేసిన విమలాదేవికి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ వేడుకలో హైదర్‌నగర్ డివిజన్‌కు చెందిన కాంగ్రెస్ మహిళా నేతలు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. సాన్నిహిత్యం, సౌహార్దతతో సాగిన ఈ వేడుక వాతావరణం హర్షాతిరేకంగా మారింది. విమలాదేవి నాయకత్వానికి అభిమానిగా ఉన్న కార్యకర్తలు ఆమె శ్రేయస్సు కోరుతూ అభినందనలు తెలియజేశారు.



## సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

**పులివెందుల, మే 21 (జనస్వరం) :** సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఉప ఆరోగ్య శాఖ అధికారి కాజా మొయిద్దీన్ పేర్కొన్నారు. పట్టణ పరిధిలోని హెల్త్ సెంటర్లో వైద్యులు స్నేహ ప్రత్యూష, శాంత కుమార్, సబ్ యూనిట్ అధికారి సిద్దయ్యలతో ఆయన సమావేశమయ్యారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమావేశం ప్రస్తుతం వర్షాలు పడుతున్నాయని కాబట్టి నీరు నిల్వలు ఉండే అవకాశం ఉందన్నారు. కాబట్టి దానివల్ల దోమలు వృద్ధి చెంది జ్వరాలు వచ్చే అవకాశం ఉందన్నారు. కాబట్టి ఆరోగ్య సిబ్బంది ఆశా కార్యకర్తలు అందరూ జాగ్రత్తగా ఉండి ఫీవర్ సర్వేలు లార్వా సర్వేలు నిర్వహించి ఎక్కడైనా జ్వరాలు వచ్చినట్లయితే నాకు, సబ్ యూనిట్ అధికారులకు వైద్య సిబ్బంది తెలియజేయాలని వైద్యాధికారులకు డాక్టర్ ఖాజా మొద్దీన్ తెలియజేశారు. వర్షాకాలం మొదలు అవుతుంది కాబట్టి ఆరోగ్య కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు అప్రమత్తంగా ఉండాలని, ఎవరికైనా జ్వరం ఉన్నట్లు అయితే దగ్గరిలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వచ్చి రక్తపరీక్షలు చేయించుకొని వ్యాది నిర్ధారణ చేయించుకొని చికిత్స చేయించుకోవాలని తెలిపారు.




## మినీ మహానాడులో టీడీపీలోకి వైసీపీ, బీజేపీ నాయకులు


**- పార్టీలోకి కండువా కప్పి ఆహ్వానించిన ఎంపి కేశినేని శివనాథ్ (చిన్ని)**

**తిరువూరు, మే 21 (జనస్వరం ప్రత్యేక ప్రతినిధి) :** విసన్నపేట మండలం పుట్రెల పంచాయతీకి చెందిన వైసీపీ, బీజేపీ నాయకులు తిరువూరు లో మంగళవారం శ్రీరస్తు పంక్షన్ హాల్ లో జరిగిన నియోజకవర్గ స్థాయి మినీ మహానాడులో టీడీపీ కండువా కప్పుకున్నారు. ఏఎంసీ డైరెక్టర్ కొలికపోగు బాల, పుట్రెల టీడీపీ సీనియర్ నాయకులు గాదె వెంకటేశ్వరరావు (జీవీఆర్) ఆధ్వర్యంలో పుట్రెల పంచాయతీకి చెందిన బీజేపీ నాయకులు చండీక వేణు బాబు, వైసీపీ నాయకులు కొలికపోగు రవి అనుచరులు భారీ సంఖ్యలో టీడీపీలో చేరారు. వీరికి ఎంపీ కేశినేని శివనాథ్, ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు పార్టీ కండువాలు కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. అలాగే టీడీపీకి చెందిన దొడ్డ కవిత, దొడ్డ హర్షవర్ధన్ రెడ్డి ఎంపీ కేశినేని శివనాథ్ ను మర్యాదపూర్వకంగా కలవగా ఆప్యాయంగా వారికి పార్టీ కండువాలు కప్పారు.



## గంజాయి నేరస్తుల పట్టివేతలో ప్రతిభ కనబరిచిన ఎస్సై వెంకటరమణకు అవార్డు

**చింతపల్లి, మే 21 (జనస్వరం) :** అల్లూరి జిల్లాలోని మన్య ప్రాంతాల్లో గంజాయి కొనుగోలు చేసి అక్రమంగా తమిళనాడు రాష్ట్రానికి తరలిస్తున్న పాత నేరస్తులను గుర్తించి అరెస్ట్ చేసిన చింతపల్లి ఎస్సై ఎం. వెంకటరమణకు పోలీసు శాఖ నుండి విశేష గుర్తింపు లభించింది. చింతపల్లి సబ్ డివిజన్ పరిధిలో గతంలో నమోదైన గంజాయి కేసుల ఆధారంగా నిందితులను గుర్తించి పట్టుకోవాలని చింతపల్లి సబ్ డివిజన్ ఏఎస్పి నవజ్యోతి మిశ్రా ఆదేశించగా, ఆయన ఆదేశాల మేరకు తమిళనాడు రాష్ట్రానికి వెళ్లి పాత నేరస్తులను అదుపులోకి తీసుకొచ్చారు. వెంకటరమణ చూపిన సేవా నిష్ఠకు గుర్తింపుగా బుధవారం అల్లూరి జిల్లా ఎస్పీ అమిత్ బర్ధర్ చేతుల మీదుగా ప్రశంసా పత్రంతో పాటు నగదు బహుమతి అందజేశారు. ఈ సందర్భంగా పలువురు పోలీస్ ఉన్నతాధికారులు కార్యక్రమంలో పాల్గొని వెంకటరమణకు అభినందనలు తెలిపారు. మాదకద్రవ్యాల నిర్మూలనకు ఆయన చేస్తున్న కృషి ప్రశంసనీయం అని వారు తెలిపారు.



# 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని విజయవంతం

**ఎంపీపీ అనూష దేవి, ఎంపీడీఓ శ్రీనివాసరావు**

**చింతపల్లి, మే 21 (జనస్వరం) :** 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని బుధవారం చింతపల్లి మండల కేంద్రంలో ఘనంగా యోగా ర్యాలీ నిర్వహించారు. ఎంపీపీ కోరాబు అనూష దేవి, ఎంపీడీఓ యు.వి.ఎస్. శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఈ ర్యాలీ ఎంపీడీవో కార్యాలయం నుంచి పాత బస్టాండ్ కూడలి వరకు నిర్వహించారు. ర్యాలీలో పెద్ద సంఖ్యలో ప్రభుత్వ శాఖల అధికారులు, సిబ్బంది హాజరై విజయవంతం చేశారు. ప్రజల్లో ఆరోగ్య చైతన్యం పెంచే ఉద్దేశంతో యోగా చేస్తున్న తీరును ప్రదర్శిస్తూ ముందడుగు వేశారు. ఈ కార్యక్రమంలో ఏ.టి.డబ్ల్యూఓ జయ నాగలక్ష్మి, వ్యాయామ ఉపాధ్యాయురాలు లోచలి వరలక్ష్మి, ఉపాధ్యాయులు సాగిన లింగన్న పడాల్, గ్రామ సచివాలయ సిబ్బంది, ఎంపీడీఓ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.





# జూదరుల అరెస్ట్

**పులివెందుల మే 21 (జనస్వరం) :** వైఎస్సార్ కడప జిల్లా సింహాద్రిపురం మండలం అగ్రహారంలో జూదం ఆడుతున్నారన్న సమాచారం మేరకు ఎస్ఐ రవికుమార్ తన సిబ్బందితో బుధవారం దాడులు నిర్వహించారు. ఈ దాడిలో జూదం ఆడుతున్న ఏడుగురిని అదుపులోకి తీసుకుని, వారి వద్ద నుంచి రూ.5,190 నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఆయన తెలిపారు. వారిపై కేసు నమోదు చేశామని, మండలంలో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే తమకు తెలపాలని ప్రజలను కోరారు.

# దొమ్మేటి వంశీ ఆహ్వానంతో నిశ్చయ తాంబూల వేడుకలో జనసేన నేతలు

**విజయవాడ, మే 21 (జనస్వరం) :** స్థానిక వెటర్నరీ కాలనీలోని సుజనా వెన్యూ లో ఈ రోజు జరిగిన నిశ్చయ తాంబూల వేడుకలో జనసేన పార్టీకి చెందిన నాయకులు హాజరై వధూవరులను ఆశీర్వదించారు. దొమ్మేటి వంశీ ఆహ్వానంతో ఈ వేడుకలో పాల్గొన్న జనసేన విజయవాడ నగర నాయకులు తిరుపతి అనూష సురేష్ లు, దొమ్మేటి మానస, యశ్వంత్ కుమార్ జంటను ఆశీర్వదించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ "ఇలాంటి శుభసందర్భాల్లో కుటుంబ సభ్యులతో కలిసి ఆనందాన్ని పంచుకోవడం ఎంతో సంతోషకరం. మానస, యశ్వంత్ దాంపత్య జీవితం సుఖసంతోషాలతో నిండాలని ఆకాంక్షిస్తున్నాం," అని తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు మంతాపురం రాజేష్ కూడా పాల్గొని వధూవరులను ఆశీర్వదించారు. సాంప్రదాయంగా, ఆహ్లాదకర వాతావరణంలో ఈ వేడుక ఘనంగా నిర్వహించబడింది. అనేకమంది బంధుమిత్రులు, స్నేహితులు హాజరై వధూవరులకు శుభాకాంక్షలు తెలియజేశారు.



# అంతర్జాతీయ క్రీడాపోటీలను తలపించేలా బీచ్ గేమ్స్

**మచిలీపట్నం, మే 21 (జనస్వరం ప్రత్యేక ప్రతినిధి) :** రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ (శాప్) ఛైర్మన్ అనిమినీ రవినాయుడు బుధవారం మంగినపూడి బీచ్ లో మసూలా ఫెస్ట్ – 2025 ఏర్పాట్లను పరిశీలించారు. జూన్ 5వ తేదీ నుండి 8వ తేదీ వరకు జరగనున్న ఈ బీచ్ ఫెస్ట్‌లో భాగంగా జల క్రీడలు, బీచ్ కబడ్డీ, బీచ్ వాలీబాల్ వంటి పోటీలు నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా బీచ్ ప్రాంతాన్ని సందర్శించిన శాప్ ఛైర్మన్, స్వాగత తోరణాలు, క్రీడా స్థలాల ఏర్పాట్లను అధికారులతో సమీక్షించారు. 8,000 మంది ప్రజలు వీక్షించేందుకు వీలుగా గ్యాలరీలు, విద్యుత్ దీపాలు, సౌండ్ సిస్టం, భద్రతా వలయాలు వంటి ఏర్పాట్లు అత్యుత్తమ ప్రమాణాలతో ఉండాలని ఆయన ఆదేశించారు. శాప్ ఛైర్మన్ మాట్లాడుతూ, 2014-19 మధ్య కాలంలో మచిలీపట్నానికి పూర్వ వైభవాన్ని తేవడంలో మంత్రి కొల్లు రవీంద్ర పాత్ర గొప్పదిగా పేర్కొన్నారు. ఇప్పుడు మళ్ళీ పర్యాటక, క్రీడా అభివృద్ధికి ఆయన తీసుకుంటున్న చర్యల నేపథ్యంలో మసూలా ఫెస్ట్‌ను ప్రణాళికాబద్ధంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ ఫెస్ట్ లో కెనోయింగ్, కయాకింగ్, పెడల్ బోటింగ్, డ్రాగన్ బోట్ వంటి నీటి క్రీడలు, బీచ్ కబడ్డీ, బీచ్ వాలీబాల్ పోటీలు జోడించనున్నట్లు వెల్లడించారు. దీనికి "మసూలా ఫెస్ట్ – 25" అనే పేరు పెట్టినట్టు తెలిపారు. మత్స్యకార సమాజానికి గుర్తుగా డాల్ఫిన్ లోగోను త్వరలో ఆవిష్కరించనున్నారు. అమరావతికి ముఖద్వారంగా రూపొందుతున్న శాశ్వత తోరణం గురించి మాట్లాడిన రవినాయుడు, అది రాష్ట్ర ముఖ్యమంత్రి దృష్టిలో చారిత్రాత్మక ప్రాముఖ్యతను సూచించేలా ఉండడం ఆనందదాయకమన్నారు. దేశవ్యాప్తంగా సాంస్కృతిక, పర్యాటక ప్రముఖులను ఈ ఉత్సవాలకు ఆహ్వానిస్తామని, మచిలీపట్నం ప్రాముఖ్యతను మరింత పెంచేందుకు ఇది దోహదపడుతుందని తెలిపారు. ఈ పర్యటనలో శాప్ ఛైర్మన్‌తోపాటు మెప్మా పీడీ సాయిబాబు, డి.ఎస్.డి.ఓ ఝాన్సీ లక్ష్మి, విజయవాడ క్రీడల అధికారి కోటేశ్వరరావు, తహసీల్దారు హరినాథ్, జల క్రీడల జిల్లా అధ్యక్షులు దావులూరి సురేంద్రబాబు, ఫిలిం ఆర్ట్ డైరెక్టర్ రమణ వంక తదితర అధికారులు పాల్గొన్నారు.



# వానర వీర.. వాయు కుమార.. జై వీర హనుమాన్

**- నేడు హనుమజ్జయంతి**

**పులివెందుల, మే 21 (జనస్వరం) :** శ్రీరామదూత ఆంజనేయుడు అంటే ప్రతి హిందువు గర్విస్తాడు. ప్రతి ఏటా హనుమంతుడి జయంతి నిర్వహించుకోవడం ఆనవాయితీగా వస్తోంది. ఈ నేపథ్యంలో గురువారం తెలుగు ప్రజలు హనుమంతుడి జయంతిని నిర్వహించుకునేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఆంజనేయ స్వామి ఆలయాలన్నీ సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. జన్మోత్సవం వైశాఖ శుద్ధ దశమి నాడు జరుపుకుంటారు. ఈ రోజున హనుమాన్ భక్తులు రోజంతా ఉపవాసముండి, హనుమన్ చాలిసా పఠనం, రామనామ జపం చేస్తారు హనుమంతుని జన్మవృత్తాంతం శివమహాపురాణం, రామాయణం, మొదలైన గ్రంథాలలో అనేకానేక గాథలతో వివరించబడి వుంది. హిందూ పురాణ కథల ప్రకారం పుంజికస్థల అనే అప్సరస అంజన అనే వానర కాంతగా జన్మించెను. కేసరి అనే వానరవీరుడు ఆమెను పెళ్ళాడెను. వారు సంతానము కొరకు భక్తితో శివుని ఆరాధించిరి. అప్పుడు వాయుదేవుడు శివుని తేజమును పండు రూపములో అంజనకొసగెను. అంజనకు జన్మించిన సుతుడే ఆంజనేయుడు. కేసరి నందనుడనీ, వాయుదేవుని అనుగ్రహముతో జన్మించినందున వాయుసుతుడనీ కూడా అంటారు. సంప్రదాయం అనుసరించి హనుమంతుని ఉపాసకులు కూడా ఈ పండుగ జరుపుకుంటారు. శ్రీరామనవమితో పాటు కొందరు ఈ జన్మోత్సవం జరుపుటను కూడా ఉంది. ఒకసారి దేవలోకమందు దేవేంద్రుడు కొలువుతీరి యున్న సమయాన పుంజికస్థల అను అప్సరసకాంత బృహస్పతి వద్దకు చేరి హాస్య ప్రసంగము చేయసాగిందట, ఆమె యొక్క హావభావ వికారాలకు బృహస్పతి మిక్కిలి ఆగ్రహించి నీవు భూలోకమందు "వానరస్త్రీ" గా జన్మింతువుగాక! అని శాపము పెట్టారు. అంత ఆ పుంజికస్థల తన తప్పిదాన్ని మన్నించి శాపవిమోచనమీయమని పరిపరి విధముల ప్రార్థించింది. దానికి బృహస్పతి సంతసించి నీవు భూలోకమందు "హనుమంతునికి" జన్మ ఇచ్చిన తరువాత తిరిగి దేవలోకమునకు రాగలవని అనుగ్రహించెను. ఇది కంబరామాయణ గాథలో గల వృత్తాంతము. ఆ శాపకారణంగా "పుంజికస్థల" భూలోకమందు వానరకన్యగా జన్మించి "కేసరి" అను అందమైన వానరాన్ని ప్రేమించి వివాహమాడింది. అంత ఆమె గర్భముదాల్చి శివాంశ సంభూతుడైన "శ్రీ ఆంజనేయస్వామి" కి తిరుమల లోని అంజనాద్రి పై జన్మ ఇచ్చిందన్న కథ వాడుకలో ఉంది.



# పేనేటి శ్రీకాంత్ పట్టుదలతో యలమవారిదిన్నె మెయిన్ రోడ్ వెలుగుల నగరమైంది

**- ప్రజల నుంచి ప్రశంసల వెల్లువ**

**నెల్లూరు, మే 21 (జనస్వరం) :** నగరంలోని 13వ డివిజన్‌కు చెందిన యలమవారిదిన్నె మెయిన్ రోడ్... కొంతకాలంగా చీకటిలో మునిగిపోయి ప్రమాదాలకు కారణమవుతూ వచ్చింది. కానీ ఇప్పుడు ఆ దృశ్యం మారింది. ఆధునిక వీధిదీపాల వెలుగుతో ఆ మార్గం ఇప్పుడు మెరుపుల రోడ్డుగా మారింది. ఈ మార్పుకు మూలహేతువు డివిజన్ నాయకుడు పేనేటి శ్రీకాంత్ అని స్థానికులు ప్రశంసలతో ముంచెత్తుతున్నారు. వీధిదీపాల ఏర్పాటు వెనుక ఉన్న శ్రీకాంత్ పట్టుదల, ప్రజాప్రతిబద్ధతకు ఈ మార్గం సాక్ష్యంగా నిలుస్తోంది. కూటమి ప్రభుత్వం ద్వారా నిధులు సమీకరించి, సంబంధిత అధికారులతో, ఇంజనీరింగ్ విభాగంతో సమన్వయం సాధించి, ప్రజల అవసరాలను స్వయంగా గుర్తించి ఈ పనిని విజయవంతంగా పూర్తిచేశారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ మాట్లాడుతూ "ప్రజల అవసరాలే నా ప్రథమ కర్తవ్యం. రాత్రిపూట చీకట్లో ప్రమాదాలకు గురవుతున్న వాహనదారులు, విద్యార్థులు, ఉద్యోగుల బాధను గమనించి వీధిదీపాల ఏర్పాటు చేపట్టాం. ఇది కేవలం ఆరంభం మాత్రమే. త్వరలో డ్రైనేజ్, రోడ్లు, పారిశుద్ధ్య పనులను కూడా వేగంగా ప్రారంభించబోతున్నాం," అని అన్నారు. ప్రజలు కూడా ఈ అభివృద్ధిని హర్షంతో స్వాగతించారు. "చాలాకాలం తర్వాత ఇలాంటి వెలుగు చూసాం. మా ప్రాంతం కూడా అభివృద్ధి చెందుతోంది అనే అనుభూతి కలుగుతోంది. శ్రీకాంత్ గారు చూపుతున్న నిబద్ధతకు ధన్యవాదాలు," అని ఒక వృద్ధ నివాసితుడు ఆనందం వ్యక్తం చేశారు. ఇదే విధంగా యలమవారిదిన్నె వాసులు "ఇంతవరకు ఇంత స్పష్టమైన అభివృద్ధిని చూడలేదు. ప్రజాప్రతినిధి ఎప్పుడైతే క్షేత్రస్థాయిలో పని చేస్తాడో అప్పుడు మార్పు సాధ్యమవుతుంది. పేనేటి శ్రీకాంత్ అటువంటి నాయకుడు," అంటూ ప్రశంసించారు. ఈ వెలుగులు యలమవారిదిన్నెకు కేవలం దీపాల వెలుగే కాకుండా, అభివృద్ధి, భద్రత, ప్రజల విశ్వాసాన్ని నింపే వెలుగులుగా నిలుస్తున్నాయి.



# క్రైస్తవుల హక్కుల పరిరక్షణకు కృషి చేస్తా : పాస్టర్ రత్నబాబు

**విజయవాడ, మే 21 (జనస్వరం) :** సెంట్రల్ నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ క్రిస్టియన్ విభాగం అధ్యక్షులుగా తనకు అవకాశం ఇచ్చిన సెంట్రల్ ఎమ్మెల్యే బోండా ఉమామహేశ్వరరావుకి కృతజ్ఞతగా ఉంటానని సెంట్రల్ టీడీపీ క్రిస్టియన్ విభాగం నూతన అధ్యక్షులు పాస్టర్ రత్నబాబు తెలిపారు. బుధవారం సెంట్రల్ ఎమ్మెల్యే కార్యాలయంలో బోండా ఉమామహేశ్వరరావును మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం పాస్టర్ రత్నబాబు మాట్లాడుతూ నియోజకవర్గంలో ఉన్న క్రైస్తవులకు తాను అన్ని విధాలుగా అండగా ఉంటానని తెలిపారు. ముఖ్యంగా క్రైస్తవ స్మశాన వాటిక అభివృద్ధి కొరకు తన వంతు కృషి చేస్తానని వెల్లడించారు. రాష్ట్ర ప్రభుత్వం ద్వారా లబ్ధి చేకూతున్న సంక్షేమ పథకాలు క్రైస్తవులకు అందే విధంగా తన వంతు తోడ్పాటు ఉంటుందని వెల్లడించారు. పాస్టర్లకి నెలకి ఇచ్చే అయిదు వేల రూపాయల జీతభత్యాలు అర్హులైన పాస్టర్లు అందరికీ చేకూరేలా ఎమ్మెల్యే బోండా ఉమా నేతృత్వంలో కృషి చేస్తానని స్పష్టం చేశారు. తనపై నమ్మకం ఉంచి తెలుగుదేశం పార్టీ సెంట్రల్ నియోజకవర్గ క్రిస్టియన్ విభాగం అధ్యక్షులుగా నియమించినందుకు పదవికి వన్నె తెచ్చే విధంగా పనిచేస్తానని స్పష్టం చేశారు. పదవి రావడానికి సహకరించిన టీడీపీ నాయకులు దీవి ఉమా, ధనశేఖర్, ఘంటా కృష్ణా మోహన్, నవనీతం సాంబశివరావులకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సెంట్రల్ నియోజకవర్గానికి చెందిన పలువురు పాస్టర్లు ఏఎస్ వాసు, గాబ్రియేల్, రూబెన్, సంపత్, ప్రసాద్, క్రైస్తవ సంఘాలకు చెందిన నాయకులు పాల్గొన్నారు.



# వ్యవసాయంలో నవధాన్యాల పద్ధతులను పాటించాలి

**పులివెందుల, మే 21 (జనస్వరం) :** వ్యవసాయంలో భాగంగా రైతులు నవధాన్యాల పద్ధతులను పాటించాలని ప్రకృతి వ్యవసాయ ట్రైనర్ భాస్కర్ రెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా లింగాలలో బుధవారం మండల పరిధిలోని సర్పంచులు రామచంద్రారెడ్డి, లక్ష్మీదేవి, రజానీలను సన్మానించారు. ఈ సందర్భంగా భాస్కర్ రెడ్డి మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయాన్ని అందరూ పాటించేలా ట్రైనింగ్ ఇవ్వడం జరిగిందన్నారు. అక్కడికి వచ్చిన రైతులకు ప్రకృతి వ్యవసాయం పద్ధతులతో పండించినవి తినడం వలన ఆరోగ్యంగా ఉండవచ్చని, పి ఎం డి ఎస్ నవధాన్యాలు ఖాళీగా ఉన్న భూముల్లో వేయడం వలన వాటి వేర్ల నుండి భూమికి కావాల్సిన ద్రవ పదార్థం అందుతుందన్నారు. అదేవిధంగా ప్రధాన పంటకు కావలసిన పోషకాలు అంది పంటలు దిగుబడి బాగా పొందవచ్చన్నారు. ఘనజీవామృతం, ద్రవజీవామృతం సర్వాంతానికి వాడుతూ పురుగులు, తెగుళ్లకు, కషాయాలు వాడుకోవడం వలన భూమి, మన ఆరోగ్యం బాగు పరచుకోవచ్చని అదేవిధంగా ముందు వారి పొలంలో పిఎండిఎస్ వేసిన రైతులు శ్రీనివాసులు రెడ్డి, కొండారెడ్డి, లక్ష్మీనారాయణ రెడ్డి, పోలిరెడ్డితో వారి అనుభవాలు వాటి నుండి ఉపయోగాలు అందరికీ అర్థమయ్యేలా వివరించారు. ఈ కార్యక్రమంలో యూనిట్ ఇంచార్జ్ జయ నాయక్ వీఓఏ. మానస, రైతులు డ్వాక్రా సభ్యులు ఏపీసీన్ఫ్ సిబ్బంది ఐ సి ఆర్ పి స్ శోభారాణి, శశికళ, అరుణ, కాసింబీ, యశోద, గంగభవాని, రమణ, బదుల్ల బీ, అనూష పాల్గొన్నారు.



# ఘనంగా నాగులూరు గ్రామంలో శ్రీ అంకమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠ వేడుక

**నాగులూరు, మే 21 (జనస్వరం ప్రత్యేక ప్రతినిధి) :** నాగులూరు గ్రామంలోని శ్రీ ఆరేటమ్మ తల్లి ఆలయంలో నూతనంగా ప్రతిష్ఠించబడిన శ్రీ అంకమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవం వైభవంగా నిర్వహించారు. ఈ పవిత్ర కార్యక్రమంలో మైలవరం నియోజకవర్గ ఇన్చార్జ్, జనసేన పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి అక్కల రామ్మోహనరావు (గాంధీ) తన కుటుంబ సమేతంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా గాంధీగారు ఆలయ ధర్మకర్తలతో కలిసి శ్రీ అంకమ్మ తల్లి విగ్రహాన్ని శాస్త్రోక్తంగా ప్రతిష్ఠించారు. అంతేగాక, విగ్రహ ప్రతిష్ఠ కోసం రూ.30,000 ఆర్థిక సహాయం అందించారు. అనంతరం ప్రత్యేక పూజలు, హోమాలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రెడ్డిగూడెం మండల జనసేన అధ్యక్షులు చాపలమడుగు కాంతారావు, నాగులూరు గ్రామ అధ్యక్షులు తోట క్రాంతిబాబు, రెడ్డికుంట గ్రామ అధ్యక్షులు గొల్లపల్లి కొండలరావు ప్రవీణ్, పలువురు జనసేన నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని తల్లి దివ్య దర్శనం పొందారు. స్థానిక జనసేన నాయకులు గాంధీగారి ప్రజాపాలనపై నిబద్ధత, గ్రామ దేవతలకు ఇచ్చే ప్రాధాన్యతకు కృతజ్ఞతలు తెలిపారు.



# పి.ఆర్.మిత్రమండలి ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం

**నెల్లూరు, మే 21 (జనస్వరం) :** నగరంలోని కొంతమంది యువకులు కలసి యువత సేన పేరుతో పిఆర్ మిత్ర మండలి ఆధ్వర్యంలో బుధవారం బోడిగాడి తోటలో సుమారు 400 మందికి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. పిఆర్ మిత్ర మండలి ఆధ్వర్యంలో యువత నెల్లూరు నగరంలో అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ప్రతి నెలా నిరుపేదలు ఎక్కువగా ఉన్నటువంటి ప్రాంతాలలో అన్నదాన కార్యక్రమం తో పాటు పలు సేవ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా పి. ఆర్.మిత్రమండలి సభ్యులు ప్రవీణ్ మాట్లాడుతూ నిరుపేదలు ఎక్కువగా ఉండే కాలనీలలో ప్రతి నెలా అన్నదాన కార్యక్రమం సురేంద్ర అన్న సహాయ సహకారాలతో పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. నేటి యువత యువత చెడు వ్యసనాలకు అలవాటు పడకుండా సేవా కార్యక్రమాలు చేయాలనే ఉద్దేశంతో పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మా బాష, విజయ్ తరుణ్, సాల్మాన్ టి ఆర్ మిత్రమండలి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.






Owned by : Sake Naresh (Chairman) - 9642067900, Managed by : Jammu Sai Kalyan (Managing Director) - 7013030690,
REGD NO :APTEL 16144, Mail Id : janaswaramnews@gmail.com Dr.no : 9-35-4A, Illipilli Narasimha Rao Street, Opp KBN College, Kothapeta, Vijayawada - 520001.

# పదవి ఏమిఇచ్చినా చక్కగా నెరవేర్చే నేత నారా లోకేష్

**- ఎంపీ కేశినేని శివనాథ్**

**- తిరువూరులో ఘనంగా నిర్వహించిన tdp మినీ మహానాడు**

**తిరువూరు, మే 21:** నారా లోకేష్ వంటి యువ నాయకుడికి టీడీపీ ఇచ్చే ఏ పదవికైనా వన్నె తెచ్చేలా సేవ చేసే నేత అని విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ పేర్కొన్నారు. తిరువూరు పట్టణంలోని శ్రీరస్తు ఫంక్షన్ హాల్ లో బుధవారం నిర్వహించిన నియోజకవర్గ స్థాయి మినీ మహానాడు సమావేశంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యులు వర్ల రామయ్య, జిల్లా పార్టీ అధ్యక్షుడు నెట్టెం రఘురామ్, ఎంపీ కేశినేని శివనాథ్, ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు, పార్టీ పరిశీలకుడు సుఖవాసి శ్రీనివాస్ తదితరులు హాజరయ్యారు. టీడీపీ జెండా ఆవిష్కరణ అనంతరం ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులు అర్పించారు. టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శిగా, రాష్ట్ర విద్యా-ఐటీ శాఖల మంత్రిగా బాధ్యతలూ నిర్వహిస్తున్న నారా లోకేష్ నేతృత్వంలో కోటి మందికి పైగా సభ్యత్వాలు నమోదైనట్టు గుర్తు చేశారు. ఈ ఘనత ద్వారా ఆయన చురుకైన నాయకత్వానికి నిదర్శనమన్నారు. లోకేష్‌కు మరింత బాధ్యతలుతో కూడిన పదవులు ఇవ్వాలని ఆయన విజ్ఞప్తి చేశారు. తిరువూరు నియోజకవర్గ అభివృద్ధి కోసం ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావుతో కలిసి లెదర్ పరిశ్రమను తీసుకురావడానికి కృషి చేస్తున్నట్టు ఎంపీ తెలిపారు. 43 ఏళ్లుగా టీడీపీ నాయకులు పదవులు లేని పరిస్థితుల్లోనూ పార్టీ కోసం నిరంతరం సేవలందిస్తున్నారని



పేర్కొన్నారు. టీడీపీ స్థాపకులు ఎన్టీఆర్ పేదల కోసం పార్టీని ప్రారంభించారని, ఆ ఆశయాలను కొనసాగిస్తూ సీఎం చంద్రబాబు పార్టీని దేశ రాజకీయంలో ముఖ్యపాత్ర పోషించే స్థాయికి చేర్చారని కొనియాడారు. ఎన్టీఆర్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు, చంద్రబాబు ప్రారంభించిన 'పనికి ఆహారం' వంటి పథకాలు దేశం మొత్తానికీ ఆదర్శంగా మారాయని అన్నారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, క్వాంటంకంప్యూటింగ్‌అభివృద్ధికిసీఎంచంద్రబాబుకృషిచేస్తున్నారని పేర్కొన్నారు. ఎప్పుడూ 20 ఏళ్లు ముందే ఆలోచించే నాయకుడిగా సీఎం చంద్రబాబు నిరూపించుకున్నారని కొనియాడారు. ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు విద్యావేత్తగా, మంచి ఆలోచనలు కలిగిన నాయకుడని ప్రశంసించారు. ఆయనకు కొంచెం ఆవేశం తక్కువైతే పూర్తి పరిపక్వ నాయకుడవుతారని హితవు చెప్పారు. పదవులు అందరికీ రావు కానీ సేవాభావంతో పనిచేయడం టీడీపీ స్ఫూర్తి అని గుర్తు చేశారు. పదవులు లేకున్నా నిండు సేవ చేసిన నేతలుగా వర్ల రామయ్య, నెట్టెం రఘురామ్ లను



ఉదాహరణగా చూపారు. వర్ల రామయ్య, నెట్టెం రఘురామ్ లు పార్టీకి శ్రద్ధగా, శ్రమగా సేవ చేస్తున్నారని కొనియాడారు. నెట్టెం రఘురామ్ మాజీ మంత్రి అయినా పదవిని ఆశించకుండా శ్రీరాంరాజగోపాల్‌ను అభ్యర్థిగా సూచించారని గుర్తు చేశారు. వీరిద్దరినీ కార్యకర్తలు ఆదర్శంగా తీసుకోవాలన్నారు. పార్టీ కోసం సమయానికి సలహాలు ఇచ్చే మిత్రులుగా వీరిద్దరికీ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకుడు సుఖవాసి శ్రీనివాస్, తిరువూరు పట్టణ అధ్యక్షుడు బొమ్మసాని ఉమామహేష్, గంపలగూడెం మండల అధ్యక్షుడు వీరారెడ్డి, జి.కొండూరు మండల అధ్యక్షుడు గడ్డి కృష్ణారెడ్డి, తిరువూరు మండల అధ్యక్షుడు వెంకట నర్సిరెడ్డి, విసన్నపేట మండల అధ్యక్షుడు మట్టా వేణుగోపాల్, ఎస్సీ సెల్ అధ్యక్షుడు సొంగా సంజయ్ వర్మ, మాజీ చైర్మన్ అలవాల రమేష్ రెడ్డి, హాజ్ కమిటీ మెంబర్ షేక్ అబ్దుల్ హుస్సేన్, మహిళా నాయకురాలు రామకోటమ్మ, మసీదు కమిటీ చైర్మన్ మొహిద్దీన్, యువత ప్రతినిధి మాదల హరికృష్ణ (కిట్టు) తదితరులు పాల్గొన్నారు.

# "తుడా"ను కొత్త పుంతలు తొక్కిస్తా

**- కొత్త చైర్మన్ డాలర్ దివాకర్ రెడ్డి స్పష్టీకరణ**

**తిరుపతి, మే 21 (జనస్వరం) :** ప్రపంచం యావత్తు గుర్తించే తిరుపతి నగరంలో అభివృద్ధి దేశాలకు ధీటుగా తిరుపతి అర్బన్ డెవలప్ మెంట్ అథారిటీ (తుడా) ని తీర్చిదిద్ది, తద్వారా ప్రజలకు సౌకర్యాలు, ప్రభుత్వానికి ఆదాయం సమకూరెలా కొత్త పుంతలు తొక్కిస్థానని తుడ కొత్త చైర్మన్ డాక్టర్ దివాకర్ రెడ్డి స్పష్టం చేశారు. తుడా కొత్త చైర్మన్ గా నియామకం అయిన ఆయన బుధవారం సాయంత్రం తుడా మైదానంలో పదవీ ప్రమాణం చేశారు. అంతకుముందు ఆయన తిరుపతి రూరల్ పెరుమాళ్లపల్లి నుంచి సుమారు 15 కి. మీ మేర రోడ్ షో, ప్రదర్శన చేపట్టారు. అనంతరం దివాకర్ రెడ్డికి పలువురు టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు శుభాకాంక్షలు తెలియజేశారు. వారిలో చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు, తిరుపతి ఎమ్మెల్యే జంగాలపల్లి శ్రీనివాసులు, జనసేన జిల్లా అధ్యక్షుడు డాక్టర్ పసుపులేటి హరిప్రసాద్, శాప్ చైర్మన్ రవినాయుడు, బీజేపీ సీనియర్ నేతలు నవీన్ కుమార్ రెడ్డి, యాదవ కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ గొల్ల నరసింహ యాదవ్ తదితరులు ఉన్నారు.



# పార్టీ కోసం కష్టపడిన వారి ఇంటికి పెద్దకొడుకులా అండగా ఉంటా : మంత్రి లోకేష్

**- పార్టీ కోసం కష్టపడిన వారి ఇంటికి పెద్దకొడుకులా అండగా ఉంటా**

**- వైసీపీ హయాంలో హత్యకు గురైన రొంపిచర్ల మండల టీడీపీ అధ్యక్షుడు వెన్నా బాలకోటిరెడ్డి**

**- బాలకోటిరెడ్డి కుటుంబ సభ్యులను పిలిపించుకుని మాట్లాడిన మంత్రి లోకేష్**

**- కుటుంబానికి జీవితాంతం అండగా ఉంటానని భరోసా**

**- ఇకపై కార్యకర్తలను నేరుగా కలుసుకోవాలని మంత్రి లోకేష్ నిర్ణయం**

**ఉండవల్లి, మే 21 (జనస్వరం ప్రత్యేక ప్రతినిధి) :** తెలుగుదేశం పార్టీకి కార్యకర్తలే బలమని, పార్టీ కోసం కష్టపడిన కార్యకర్తల బాధ్యత తాను తీసుకుంటానని, ఇంటికి పెద్దకొడుకులా అండగా ఉంటానని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. కార్యకర్తల సంక్షేమం కోసం అహర్నిశలు కృషిచేస్తున్న మంత్రి నారా లోకేష్.. తన నియోజకవర్గ పర్యటనలో ముందుగా కార్యకర్తల సమావేశమై వారి సమస్యలను నేరుగా తెలుసుకుని పరిష్కరిస్తున్నారు. ఇకపై ఉండవల్లి నివాసంలో కార్యకర్తలను నేరుగా కలుసుకుని వారికి అండగా నిలవాలని నిర్ణయించుకున్నారు. ఈ నేపథ్యంలో వైసీపీ గూండాల చేతిలో హత్యకు గురైన పల్నాడు జిల్లా రొంపిచర్ల మండల టీడీపీ అధ్యక్షుడు, మాజీ ఎంపీపీ వెన్నా బాలకోటిరెడ్డి కుటుంబ సభ్యులను ఉండవల్లి నివాసానికి పిలిపించుకుని వారి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు.

కార్యకర్తే అధినేత హామీని నిలబెట్టుకుంటున్న మంత్రి లోకేష్ : అలవాల గ్రామానికి చెందిన వెన్నా బాలకోటిరెడ్డి నాలుగు దశాబ్దాలుగా పార్టీ పటిష్టత, ప్రజా సంక్షేమ కోసం పనిచేశారు. దీనిని ఓర్వలేని వైసీపీ గూండాలు అప్పటి వైసీపీ ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి అండతో ఇంట్లో నిద్రిస్తున్న వెన్నా బాలకోటిరెడ్డిని తుపాకీతో కాల్చి చంపారు. హత్యకు ఆరు నెలల ముందు కత్తులతో దాడికి యత్నించగా ప్రాణాపాయం నుంచి బయటపడ్డారు. రక్షణ కోసం పోలీసులకు పలుమార్లు ఫిర్యాదుచేసినప్పటికీ పట్టించుకోలేదు. కూటమి ప్రభుత్వంలో కార్యకర్తే అధినేత అనే లక్ష్యంతో పనిచేస్తున్న పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్.. వైసీపీ విధ్వంస పాలనను ఎదుర్కొని తీవ్రంగా నష్టపోయిన కార్యకర్తల కుటుంబాలకు అన్ని విధాల అండగా నిలుస్తున్నారు.

హత్య కేసు నిందితులను కఠినంగా శిక్షించాలి : దివంగత వెన్నా బాలకోటిరెడ్డి సతీమణి వెన్నా నాగేంద్రమ్మ, బాలకోటిరెడ్డి సోదరుని కుమారులు వెన్నా నరసింహారెడ్డి, వెన్నా రామకృష్ణారెడ్డిలను కలుసుకున్న మంత్రి లోకేష్.. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. హత్య పూర్వాపరాలు, వెన్నా నాగేంద్రమ్మ ఆరోగ్యపరిస్థితిపై వాకబు చేశారు. హత్య కేసు నిందితులు స్వేచ్ఛగా సంచరిస్తున్నారని, కేసును పూర్తిస్థాయిలో విచారణ జరిపి నిందితులను కఠినంగా శిక్షించేలా చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా బాలకోటిరెడ్డి కుటుంబ సభ్యులు మంత్రి నారా లోకేష్ కు విజ్ఞప్తి చేశారు. ఆర్థికంగా చాలా



నష్టపోయామని, ఉపాధి హామీ, గృహనిర్మాణం బిల్లులు పెండింగ్ లో ఉండటంతో పాటు తాము నివసిస్తున్న ఇల్లు తాకట్టులో ఉందని మంత్రి దృష్టికి తీసుకువచ్చారు.

బాలకోటిరెడ్డి కుటుంబానికి జీవితాంతం అండగా ఉంటానని భరోసా : ఈ సందర్భంగా మంత్రి నారా లోకేష్ మాట్లాడుతూ.. వెన్నా బాలకోటిరెడ్డి కుటుంబానికి జీవితాంతం అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. పెండింగ్ బిల్లులను చెల్లించడంతో పాటు పార్టీ పరంగా ఇంటిని తాకట్టు నుంచి విడిపిస్తానని హామీ ఇచ్చారు. హత్య కేసు నిందితులకు కఠిన శిక్ష పడేలా చర్యలు తీసుకుంటామన్నారు. వైసీపీ దాష్టీకాలకు ఎదురొడ్డి నిలిచిన అంజిరెడ్డి తాత, మంజులారెడ్డి, తోట చంద్రయ్యలే మనకు స్ఫూర్తి అని.. ఇంటికి పెద్దకొడుకులా బాధ్యత తీసుకుంటానని వారికి ధైర్యం చెప్పారు. తమకు మంత్రి లోకేష్ అండగా నిలబడటం పట్ల బాలకోటిరెడ్డి కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

# అక్రమ కేసులో కోర్టులో హాజరైన జనసేన నాయకులు

**- వైసీపీ మాజీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్ రెడ్డి జనసేన నాయకులపై దాడి కేసుకు సంబంధించి కాకినాడ కోర్టులో వాయిదా**

**కాకినాడ, మే 21 (జనస్వరం ప్రత్యేక ప్రతినిధి) :** జనసేన పార్టీ అధ్యక్షులు కొణిదెల పవన్ కళ్యాణ్ ను దూషించిన సందర్భంలో ప్రతిఘటనగా జరిగిన ఘటనలకు సంబంధించిన కేసులో, అప్పటి వైఎస్సార్సీపీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్ రెడ్డి మాపై బనాయించిన అక్రమ కేసుకు సంబంధించి బుధవారం కాకినాడ కోర్టులో వాయిదాకు హాజరైనట్లు జనసేన నాయకులు తెలిపారు. పవన్ కళ్యాణ్‌ను కించపరిచేలా చేసిన వ్యాఖ్యలకు వ్యతిరేకంగా స్పందించినందుకు, కాకినాడలో జనసేన కార్యకర్తలపై రౌడీలతో దాడి చేయించి, అసభ్యపదజాలంతో తిట్టించి, పైగా అదే విషయంపై జనసేన కార్యకర్తలపైనే కేసులు పెట్టించిన వ్యవహారం తెలిసిన విషయమే. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శెట్టిబలజ కార్పొరేషన్ డైరెక్టర్ పెంకే జగదీష్, ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ఉపాధ్యక్షురాలు సుంకర కృష్ణవేణి, నున్న గణేష్ నాయుడు, మర్రి దొరబాబు, ఫాజిల్, మహేష్ తదితరులు పాల్గొన్నారు. జనసేన నాయకులు ఈ కేసును రాజకీయ దురుద్దేశంతో పెట్టినట్లు పేర్కొంటున్నారు. న్యాయపరంగా తమ నిర్దోషిత్వాన్ని నిరూపిస్తామని, సత్యం ఎప్పటికీ గెలుస్తుందనే నమ్మకంతో ముందుకు సాగుతున్నామని వారు పేర్కొన్నారు.



# పాలకొల్లు పట్టణ వీధుల్లో జాతీయ పతాకంతో భారీ తిరంగా ర్యాలీ

**పాలకొల్లు, మే 21 (జనస్వరం) :** వందేమాతరం నినాదం పాలకొల్లు పురవీధుల్లో మార్మోగింది. ఒక్కసారిగా వందేమాతరం నినాదాలు మిన్నంటడంతో క్షీరపురి జన్మ చరితార్థమైంది. హమారా భారత్ మహాన్ హై.. సారే జహాసే అచ్చా హిందుస్థా హమారా అంటూ కూటమి నాయకులు నినాదాలు చేస్తూ జాతీయ పతాకంతో జాతీయ జెండాలతో పురవీధుల్లో భారీ ర్యాలీ నిర్వహించారు. స్థానిక హ్యాట్రిక్ ఎమ్మెల్యే రాష్ట్ర జల వనరుల అభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు సారథ్యంలో కూటమి నాయకులు వీర మహిళలు తిరంగా కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. స్థానిక ఎడ్ల బజారు ఫైర్ స్టేషన్ నుండి ప్రారంభమైన భారీ ర్యాలీ గాంధీ బొమ్మల సెంటర్ వరకు కొనసాగింది. భారత్ మాతాకీ జై అంటూ భారత ప్రధాని నరేంద్ర మోడీ సారథ్యంలో నిర్వహిస్తున్న ఆపరేషన్ సింధూర్ విజయవంతంపై హర్ష వ్యక్తం చేస్తూ భారత త్రివిధ దళాధిపతులకు సైనికులకు సంఘీభావం ప్రకటించారు. ఈ సందర్భంగా మంత్రి రామానాయుడు మాట్లాడుతూ పాకిస్తాన్ దూకుడు చర్యలకు కళ్లెం వేయవలసిన తరుణంలో భారత ప్రధాని నరేంద్ర మోడీ హోమ్ మినిస్టర్ అమిత్ షా త్రివిధ దళాధిపతులు ఎంతో చాకచక్యంతో ప్రవర్తిస్తూ తమ చతురతను ప్రదర్శిస్తూ భారతీయులకు మనో ధైర్యాన్ని కల్పించడం చాలా




అభినందనీయమన్నారు. మనదేశంలోనే కాకుండా ప్రపంచంలోనే టెర్రరిజాన్ని అణిచివేయవలసిన తరుణం ఆసన్నమైనదని దీనికి ఐక్యరాజ్యసమితి కూడా ఆమోదం తెలిపిందని ప్రపంచ దేశాలన్నీ టెర్రరిజాన్ని వ్యతిరేకించే విధంగా మన భారతదేశానికి సంఘీభావం తెలియజేయడం శుభపరిణామం అన్నారు. భవిష్యత్తులో పెహల్గాం వంటి దాడులు జరక్కుండా పటిష్టమైన భద్రతను ఏర్పాటు చేయవలసిన అవసరం ఉందన్నారు. తిరంగా విజయవంతంలో భాగస్వాములైన ప్రతి ఒక్కరికి మంత్రి రామానాయుడు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ అంగర రామ్మోహన్, బిజెపి నాయకులు యర్రంశెట్టి పద్మారావు, ఉన్నమట్ల కబర్ధి, జక్కంపూడి కుమార్, కొల్లి కొండ ప్రసాద్, టిడిపి నాయకులు పెచ్చెట్టి బాబు, కర్నేన గౌరు నాయుడు-రోజా రమణి, గండేటి వెంకటేశ్వరరావు, కోడి విజయభాస్కర్, పాముల రజిని కుమార్,, మామిడి శెట్టి పెద్దిరాజు, ముచ్చర్ల శ్రీనివాస్, బోణం నాని, ఆరుమిల్లి రామ శ్రీనివాస్,



రుద్రరాజు సత్యనారాయణ రాజు, పెన్మేత్స రామభద్ర రాజు, బందెల భాస్కర్, రావూరి అప్పారావు, జనసేన నాయకులు బోణం చినబాబు, తులా రామలింగేశ్వరరావు, శిడగం సురేంద్ర, పినిశెట్టి శ్రీనివాస్, విన్నకోట గోపి, బిట్టా లక్ష్మీనారాయణ, సాధనాల దుర్గాబాబు, వీర మహిళలు మైగాపుల పద్మజ, ముత్యాల అశ్విని, వన్నెంరెడ్డి భవాని తదితరులు పాల్గొన్నారు.

# మహానాడు విజయవంతం చేయండి

**- నాయకులకు కార్యకర్తలకు సత్య ప్రభ పిలుపు**

**ప్రత్తిపాడు, మే 21 (జనస్వరం) :** జిల్లా కేంద్రంమైన కాకినాడలో నిర్వహించనున్న మహానాడుకు నియోజకవర్గం నుండి పెద్ద సంఖ్యలో టిడిపి శ్రేణులు తరలి రావాలని ప్రత్తిపాడు నియోజకవర్గ ఎమ్మెల్యే పరుపుల సత్య ప్రభ రాజా పిలుపునిచ్చారు. గురువారం జిల్లా కేంద్రం కాకినాడలో తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు, రాష్ట్ర తెలుగుదేశం



పార్టీ అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు ఆదేశాల మేరకు జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు జ్యోతుల నవీన్ కుమార్ అధ్యక్షతన నిర్వహించనున్న మహానాడు కార్యక్రమానికి నియోజకవర్గ నలుమూలల నుండి వేలాదిగా టీడీపీ శ్రేణులు తరలి రావాలని కోరారు. ఉదయం 9 గంటల 30 నిమిషాలకు ఈ కార్యక్రమం కాకినాడ వివేకానంద పార్కు వద్ద గల గోదావరి కళాక్షేత్రం, (పాథిన్ కన్వెన్షన్ హాల్) లో అత్యంత వైభవంగా నిర్వహించనున్నారు. రాష్ట్ర జిల్లా టీడీపీకి చెందిన నేతలు ఈ కార్యక్రమంలో పాల్గొంటారన్నారు. నియోజకవర్గంలో నాలుగు మండలాలు ఏలేశ్వరం నగర పంచాయతీ నుండి భారీ సంఖ్యలో తెలుగు తమ్ముళ్లు తరలిరావాలని, ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు.

# తూర్పు నియోజకవర్గాన్ని టీడీపీ కంచుకోటగా మార్చిన ఘనత గద్దె రామమోహన్‌దే

**విజయవాడ, మే 21 (జనస్వరం ప్రత్యేక ప్రతినిధి) :** స్థానిక తూర్పు నియోజకవర్గాన్ని తెలుగుదేశం పార్టీకి కంచుకోటగా మార్చిన ఘనత హ్యాట్రిక్ ఎమ్మెల్యే గద్దె రామమోహన్‌దేనని పార్లమెంటు సభ్యుడు కేశినేని శివనాథ్ ప్రశంసించారు. బుధవారం జ్యోతి కన్వెన్షన్ హాలులో వైభవంగా జరిగిన తూర్పు నియోజకవర్గ 'మినీ మహానాడు'లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎంపీ శివనాథ్, "గద్దె రామమోహన్ నియోజకవర్గంలో ప్రతిరోజూ పర్యటిస్తూ ప్రజలకు సంక్షేమ పథకాలు చేరవేస్తున్నారు. స్వంత నిధులతో పేదలకు ఆర్థిక సహాయాన్ని అందిస్తూ అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నారు," అని తెలిపారు. ఆయన సేవా కార్యక్రమాలను చూసి తానూ స్ఫూర్తి పొందుతున్నానని అన్నారు. వైసీపీ పాలనలో టీడీపీ నాయకులపై జరిగిన దాడులను గుర్తుచేసిన శివనాథ్, "అదిగో అప్పట్లో కూడా మా కార్యకర్తలు చట్టపరంగా స్పందించారు. ఇప్పుడు తిరువూరులో దౌర్జన్యాలకు గట్టి సమాధానం ఇచ్చారు," అన్నారు. పింఛను, అభివృద్ధిలో చంద్రబాబు ప్రభుత్వం దేశానికి ఆదర్శంగా నిలుస్తోందన్నారు. నారా లోకేష్ నాయకత్వంలో పార్టీకి కోటి మందికి పైగా సభ్యత్వం ఉందని పేర్కొన్నారు. ఎమ్మెల్యే గద్దె రామమోహన్ మాట్లాడుతూ, "వైఎస్సార్‌సీపీ హయాంలో మమ్మల్ని హౌస్ అరెస్టులకు గురిచేశారు. కానీ చంద్రబాబు మాకు ధైర్యం ఇచ్చారు. పవన్ కళ్యాణ్, బీజేపీతో కలిసి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడం సంతోషకరమైన విషయమన్నారు." మహానాడు కార్యక్రమం పార్టీని మరింత బలోపేతం చేస్తుందని చెప్పారు. తెలుగుదేశం ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు నెట్టం రఘురామ్, మహానాడు అంటే టీడీపీ పండుగ అని పేర్కొన్నారు. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో ప్రజాస్వామ్యాన్ని కించపరిచే విధంగా పాలన సాగిందని విమర్శించారు. స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్ కార్పొరేషన్ ఛైర్మన్ పట్టాభిరామ్ మాట్లాడుతూ, "హ్యాట్రిక్ విజయాన్ని సాధించడానికి గద్దె రామమోహన్ ప్రజల మధ్య నిరంతరం ఉండటమే కారణం. ఆయన సేవా దృక్పథం వల్లే ప్రజలు అతనికి తిరుగులేని మద్దతు ఇచ్చారు," అని అన్నారు. ఈ కార్యక్రమంలో శాలివాహన, కుమ్మరి కార్పొరేషన్ ఛైర్మన్ పేరేపి ఈశ్వర్, మాజీ ఎమ్మెల్సీ పరుచూరి అశోక్‌బాబు, రాష్ట్ర నేతలు



బొప్పన భవకుమార్, షేక్ ఫిరోజ్, గన్నె ప్రసాద్, చెన్నుపాటి గాంధీ, తూమాటి ప్రేమ్‌నాథ్, జిల్లా నేతలు షేక్ నాగూర్, చెన్నుపాటి ఉషారాణి, సొంగా సంజయ్‌వర్మ తదితరులు పాల్గొన్నారు. మృతి చెందిన టీడీపీ కార్యకర్తలకు నివాళులర్పించారు.

# ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అడ్మిషన్ల కోసం దరఖాస్తు చేసుకోండి

**బొంరాస్ పేట, మే 21 (జనస్వరం) :** మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 2025-26 విద్యా సంవత్సరానికి గాను మొదటి, రెండవ సంవత్సరంలో ప్రవేశాలకు దరఖాస్తులు చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపల్ కుమారస్వామి అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని జడ్పీహెచ్ఎస్ ఉన్నత పాఠశాలలో అడ్మిషన్లకు సంబంధించి ప్రచార పోస్టర్ ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ కుమారస్వామి మాట్లాడుతూ ఇంటర్మీడియట్ మొదటి, రెండవ సంవత్సరంలో ఎంపీసీ, బైపిసి, హెచ్ఈసి, సీఈసీ గ్రూపులతో పాటు ఒకేషనల్ ఎంపీహెచ్డబ్ల్యూ, ఎంఎల్టి గ్రూపుల్లో సీట్లు అందుబాటులో ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ హరిలాల్, గ్రామస్తులు రామచంద్ర రెడ్డి, నర్సింలు గౌడ్, రసాయన శాస్త్ర అధ్యాపకులు సురేష్, హరికృష్ణ, జడ్పీహెచ్ఎస్ పాఠశాల ఉపాధ్యాయులు, స్పెషల్ టీచర్ వేణుగోపాల్, ఎంఈఓ కార్యాలయ సిబ్బంది గౌస్ తదితరులు ఉన్నారు.



WWW.JANASWARAM.COM

జనస్వరం

# రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ధాన్యం కొనుగోళ్లు చేయాలి

**బొంరాస్ పేట, మే 21 (జనస్వరం)** : మండల పరిధిలోని కొత్తూరు గ్రామంలో ఏర్పాటు చేసిన ఐకేపీ వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని బుధవారం వికారాబాద్ జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యా నాయక్ తనిఖీ చేశారు. లారీల కొరత కారణంగా 4000 బస్తాల వరకు కొనుగోలు చేసిన ధాన్యం నిల్వ ఉండిపోయిందని కొనుగోలు కేంద్రం నిర్వాహకులు అదనపు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు.ఆయన వెంట ఏపిఎం సాయన్న వీఓఏ, ఐకేపీ సిబ్బంది తదితరులు ఉన్నారు..



# నాగిరెడ్డిపల్లిలో డీపీఓ సుడిగాలి పర్యటన

**బొంరాస్ పేట, మే 21 (జనస్వరం)** : మండల పరిధిలోని నాగిరెడ్డిపల్లి గ్రామంలో బుధవారం డీపీఓ జయసుధ సుడిగాలి పర్యటన చేశారు. కంపోస్ట్ షెడ్డును పరిశీలించి తడి, పొడి చెత్తను వేరు చేయాలని, నర్సరీలోని మొక్కలకు క్రమం తప్పకుండా నీరు పట్టాలని, కలుపు మొక్కలను తీసివేయాలన్నారు. రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థను పరిశీలించి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ప్రజలకు అవగాహన కల్పించారు. గ్రామపంచాయతీలో పలు రకాల రికార్డులను తనిఖీ చేశారు. గ్రామంలో కొనసాగుతున్న ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలను పరిశీలించి లబ్ధిదారులతో మాట్లాడారు. డీపీఓ వెంట మండల పంచాయతీ అధికారి రవి నాయక్, గ్రామపంచాయతీ కార్యదర్శి బసంత్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.






# యూపీఐ లావాదేవీలు ఇక మరింత సురక్షితం: కేంద్రం కీలక ఆవిష్కరణ

దేశంలో మొబైల్ ఫోన్ల ద్వారా జరుగుతున్న సైబర్ మోసాలు, ఆర్థిక నేరాలను అరికట్టే దిశగా కేంద్ర ప్రభుత్వం కీలక ముందడుగు వేసింది. టెలికాం శాఖ (డాట్) బుధవారం 'ఫైనాన్షియల్ ఫ్రాడ్ రిస్క్ ఇండికేటర్' (ఎఫ్ఆర్ఐ) అనే నూతన వ్యవస్థను భాగస్వామ్య పక్షాలతో పంచుకోనున్నట్లు ప్రకటించింది. ఈ విశ్లేషణాత్మక సాధనం, సైబర్ మోసాల నివారణలో ఆర్థిక సంస్థలకు ముందుగానే కీలక సమాచారాన్ని అందించి అప్రమత్తం చేస్తుంది. డిజిటల్ ఇంటెలిజెన్స్ ప్లాట్‌ఫామ్ లో భాగంగా అభివృద్ధి చేసిన ఈ ఎఫ్ఆర్ఐ వ్యవస్థ, ఏదైనా మొబైల్ నంబర్‌కు డిజిటల్ పద్ధతిలో డబ్బు పంపేటప్పుడు ఆ నంబర్‌తో ముడిపడి ఉన్న ఆర్థిక మోసాల ప్రమాదాన్ని తెలియజేస్తుంది. దీనివల్ల సైబర్ రక్షణ మరింత పటిష్టమవడంతో పాటు, ధృవీకరణ ప్రక్రియలు మెరుగుపడతాయని కేంద్ర కమ్యూనికేషన్ల మంత్రిత్వ శాఖ వెల్లడించింది. ఒక మొబైల్ నంబర్ ఆర్థిక మోసాలకు పాల్పడే అవకాశం ఎంత ఉందనేదాని ఆధారంగా దానికి 'మధ్యస్థం', 'అధికం' లేదా 'అత్యంత అధికం' అనే రిస్క్ కేటగిరీలను ఈ ఎఫ్ఆర్ఐ నిర్ధారిస్తుంది.

దేశవ్యాప్తంగా 90 శాతానికి పైగా యూపీఐ లావాదేవీలు నిర్వహిస్తున్న ఫోన్‌పే, పేటీఎం, గూగుల్ పే వంటి ప్రముఖ యూపీఐ వేదికలు ఇప్పటికే ఈ డీఐపీ హెచ్చరికలను తమ వ్యవస్థలలో అనుసంధానించుకునే ప్రక్రియను ప్రారంభించాయి. ఒక ప్రముఖ యూపీఐ సంస్థ, అనుమానిత లావాదేవీల విషయంలో కొంత జాప్యం చేస్తూ, వినియోగదారులకు హెచ్చరికలు పంపి, వారి అనుమతి తీసుకునే విధానాన్ని ప్రవేశపెట్టినట్లు మంత్రిత్వ శాఖ తెలిపింది. ఇతర బ్యాంకులు కూడా ఈ సమాచారాన్ని సైబర్ మోసాల నివారణకు చురుగ్గా వినియోగిస్తున్నాయని పేర్కొంది. దేశంలో యూపీఐ చెల్లింపులు అత్యంత ప్రాచుర్యం పొందిన నేపథ్యంలో, ఈ కొత్త వ్యవస్థ లక్షలాది మంది పౌరులను సైబర్ మోసాల బారిన పడకుండా కాపాడగలదని భావిస్తున్నారు. అనుమానిత మోసాలపై టెలికాం, ఆర్థిక రంగాల్లో త్వరితగతిన, సమష్టిగా చర్యలు తీసుకోవడానికి ఎఫ్ఆర్ఐ వీలు కల్పిస్తుంది. సైబర్ నేరాల్లో ప్రమేయం ఉన్నట్లు తేలిన, పునఃపరిశీలనలో విఫలమైన, నిర్దేశిత పరిమితులను మించిన మొబైల్ నంబర్ల జాబితాను టెలికాం శాఖకు చెందిన డిజిటల్ ఇంటెలిజెన్స్ యూనిట్ క్రమం తప్పకుండా సంబంధిత సంస్థలతో పంచుకుంటుంది. ఈ నంబర్లను కూడా సాధారణంగా ఆర్థిక మోసాలకు ఉపయోగిస్తుంటారు. ఏదైనా అనుమానిత మొబైల్ నంబర్‌ను గుర్తించిన వెంటనే, దానిపై విశ్లేషణ జరిపి, ఆర్థిక రిస్క్ స్థాయిని నిర్ధారించి, ఆ సమాచారాన్ని డీఐపీ ద్వారా అన్ని భాగస్వామ్య పక్షాలకు ఎఫ్ఆర్ఐ తక్షణమే తెలియజేస్తుంది.




# మహిళా సమైక్య కార్యాలయంలో విధివిధానాలపై సమీక్ష సమావేశం

**ప్రత్తిపాడు, మే 21 (జనస్వరం)** : మహిళా సమాఖ్య కార్యాలయంలో గ్రామ సంఘాల అసిస్టెంట్ల సమీక్ష సమావేశానికి జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ జి శ్రీనివాసరావు అధ్యక్షతన సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రత్తిపాడు మండలం సంబంధించి 56 వివోఏల ను సమీక్ష నిర్వహించారు. ప్రధానంగా ప్రధానమంత్రి సూర్య ఘర్ యోజన పై సమీక్ష చేస్తూ ప్రతిపాడు మండలానికి 2000 రూఫ్ టాప్ లు పెట్టించాలని దానికి ప్రతి డ్వాక్రా సభ్యులు ఈ అవకాశాన్ని ఉపయోగించుకుని పీఎం సూర్య ఘర్ ద్వారా రాయితీని పొందాలని తెలిపారు. అలాగే శ్రీనిధి సి ఐఎఫ్, విఆర్ఎఫ్, ఉన్నతి రికవరీలు 100 శాతం ఉండాలని, అలాగే బ్యాంకుల ద్వారా అప్పులు తీసుకుని డ్వాక్రా సభ్యులు యూనిట్లు పెట్టాలని, అలాగే ప్రతి మహిళ తమ ఇంటి ఆవరణలో పెరటి తోటలు పెంచాలని సూచించారు. ఈ సమీక్ష కార్యక్రమంలో ఏపీడీ జీలాని, డీపీఎం లు రాయ్, భరత్, అనిల్ ఏపీఎం వెంకట్, సీసీలు శ్రీను, శ్రీనివాస్, నూకరత్నం, ఎంఎస్ఏ నాగేశ్వరరావు 56 మంది వీఓఎలు హాజరయ్యారు.



# తుని, అన్నవరం రైల్వే స్టేషన్లలో ఎక్స్‌ప్రెస్ హాల్టులు పెంచండి

**- డిఆర్ యుసిసి సమావేశంలో ప్రస్తావించిన కమిటీ సభ్యుడు గొర్లి నాగేశ్వరరావు**

**శంఖవరం, మే 21 (జనస్వరం)** : కాకినాడ పార్లమెంట్ పరిధిలో గల తుని, అన్నవరం రైల్వే స్టేషన్లలో పలు ఎక్స్‌ప్రెస్ ట్రైన్ల హాల్టులు పెంచాలని డిఆర్ యుసిసి సమావేశంలో కమిటీ సభ్యుడు, జనసేన నేత గొర్లి నాగేశ్వరరావు ప్రస్తావించారు. విజయవాడలో డివిజనల్ రైల్వే యూజర్స్ కన్సల్టేటివ్ కమిటీ సమావేశాన్ని బుధవారం డిఆర్ఎం నరేంద్ర ఆనంద్ పాటిల్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సమావేశంలో డిఆర్ యుసి కమిటీ సభ్యుడు, జనసేన నేత గొర్లి నాగేశ్వరరావు పాల్గొని మాట్లాడారు. కాకినాడ పార్లమెంట్ సభ్యుడు తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్ ఆదేశాల మేరకు కాకినాడ పార్లమెంటు పరిధిలోని పలు రైల్వే స్టేషన్లలో నెలకొన్న ముఖ్యమైన సమస్యలను సమావేశం దృష్టికి తీసుకొచ్చినట్లు నాగేశ్వరరావు వెల్లడించారు. ముఖ్యంగా అన్నవరం ప్రముఖ పుణ్యక్షేత్రం కావడంతో రోజుకు సుమారు 50 వేల మంది భక్తులు సుదూర ప్రాంతాల నుండి తరలి వస్తుంటారని, ముఖ్యమైన ఎక్స్‌ప్రెస్ రైలులు అన్నింటికీ హాల్టులు మంజూరు చేయాలన్నారు. తుని పరిసర ప్రాంతాలలో తమలపాకు సాగు అధికంగా ఉందని, వీటిని రైతులు బొంబాయికి ఎగుమతి చేస్తుంటారని, దీనికి అనుకూలంగా ఈ ప్రాంతం నుండి బొంబాయి కు డైరెక్ట్ ట్రైన్ వేయాలని కోరారు. కాకినాడ పార్లమెంట్ పరిధిలో రైల్వే స్టేషన్లలో తాగునీటి సదుపాయం, మరుగుదొడ్లు, వాటి పారిశుధ్యం తదితర అభివృద్ధి అంశాలను



సమావేశంలో నాగేశ్వరరావు డిఆర్ఎం నరేంద్ర ఆనంద్ పాటిల్ దృష్టికి తీసుకురాగా, ఆయన సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. డిఆర్ యుసిసి సమావేశంలో తనతోపాటు 19 మంది కమిటీ సభ్యులు పాల్గొన్నట్లు నాగేశ్వరరావు వెల్లడించారు.

# శంఖవరం హైస్కూల్లో కంప్యూటర్ల చోరీ నిందితులు అరెస్ట్

**- కంప్యూటర్ల సామాగ్రి స్వాధీనం చేసుకున్న అన్నవరం పోలీసులు**

**శంఖవరం, మే 21 (జనస్వరం)** : మండల కేంద్రం శంఖవరంలో గల జిల్లా పరిషత్ హైస్కూల్ లో గడిచిన నాలుగు రోజుల క్రితం కంప్యూటర్లు చోరీకి గురయ్యాయి. చోరీపై హైస్కూల్ ప్రధానోపాధ్యాయురాలు అన్నవరం పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనితో జిల్లా ఎస్పీ బిందు మాధవ్ ఆదేశాలతో పెద్దాపురం డిఎస్పీ శ్రీహరిరాజు ఆధ్వర్యంలో ప్రత్తిపాడు సీఐ సూర్య అప్పారావు అన్నవరం ఎస్సైలు శ్రీ హరిబాబు, ప్రసాద్ శంఖవరం హైస్కూలును పరిశీలించి, దర్యాప్తు వేగవంతం చేశారు. బుధవారం మధ్యాహ్నం 11:30 గంటల సమయంలో నిల్లిపూడి నుండి పూడి వచ్చే అడ్డు రోడ్డు లో చోరీ చేసినా నిందితులు ఆటోలో కంప్యూటర్ల సామాగ్రిని తరలిస్తుండగా శంఖవరం గ్రామానికి చెందిన గామాల అశోక్, బోడపాటి చిన్నోడు అనే ఇరువురు చోరీ నిందితులను అన్నవరం పోలీసులు అరెస్టు చేసి, ఆటోలోని కంప్యూటర్లు, సిపియూలు, స్పీకర్లు, ప్రింటర్లు, వాటర్ ప్యూరిఫైయర్లు స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ సుమారు ఒక లక్ష ఐదు వేల రూపాయలు ఉంటుందన్నారు. నిందితులను ప్రత్తిపాడు కోర్టు జడ్జి ముందు హాజరపరచనున్నట్లు అన్నవరం పోలీసులు తెలిపారు. త్వరితగతిన చోరీ కేసును చేదించిన అన్నవరం పోలీసులను జిల్లా ఎస్పీ బిందు మాధవ్ అభినందించారు.



# భారత సైన్యం పాకిస్తాన్ ఉగ్రవాదులకు గట్టి బుద్ధి చెప్పింది

**- ఎంపీ కేశినేని శివనాథ్**
**- తిరంగా ర్యాలీలో పాల్గొన్న ఎంపీ శివనాథ్, పట్టాభిరామ్**
**- భారత సైనికులకు సంఘీభావంగా విజయవాడలో ర్యాలీ**

**విజయవాడ, మే 21 (జనస్వరం ప్రత్యేక ప్రతినిధి)** : పహల్గాం ప్రాంతంలో దాడికి పాల్పడ్డ పాకిస్తాన్ ఉగ్రవాదులపై భారత సైన్యం విజయవంతంగా పోరాడిన సందర్భంగా దేశ రక్షణలో అమితమైన ధైర్యం ప్రదర్శించిన సైనికులకు సంఘీభావంగా విజయవాడలో తిరంగా ర్యాలీ నిర్వహించారు. బృందావనం కాలనీలోని సింధు భవన్ నుంచి ప్రారంభమైన ఈ ర్యాలీని పూజ్ సింద్ పంచాయిత్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్, స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీ శివనాథ్ మాట్లాడుతూ, "ప్రధానమంత్రి నరేంద్ర మోడీ నాయకత్వంలో భారత సైన్యం పాకిస్తాన్ ఉగ్రవాద మూకలకు గట్టి బుద్ధి చెప్పింది. దేశ భద్రత విషయంలో భారత్ దిగొచ్చే ప్రశ్నే లేదు," అని స్పష్టం చేశారు. ర్యాలీలో పూజ్ సింద్ పంచాయిత్ విజయవాడ ప్రెసిడెంట్ సి.హెచ్. దయాళ్ చంద్ నాని, సెక్రటరీ చంద్రప్రకాష్ సత్యదేవ్, దుర్గగుడి పాలకమండలి మాజీ చైర్మన్ పైలా సోమినాయుడు, టీడీపీ నాయకులు పీత బుజ్జి, బీజేపీ నాయకులు పోతంశెట్టి నాగేశ్వరరావుతో పాటు




మహిళలు, యువకులు, నగరవాసులు భారీగా పాల్గొన్నారు. దేశభక్తి నినాదాలతో మార్మోగిన ఈ ర్యాలీ, యువతలో దేశాభిమానాన్ని మరింత పెంచేలా కార్యక్రమంగా నిలిచింది.

# 24 గంటలూ ప్రజలకు అందుబాటులోకి చలాన్ కార్యాలయం

**- వాహనదారుల సౌకర్యార్థం వ్యాస్ కాంప్లెక్స్‌కి మారింది కార్యాలయం**

**విజయవాడ, మే 21 (జనస్వరం ప్రత్యేక ప్రతినిధి)** : నగరంలో వాహనదారులకు పెండింగ్ చలాన్లు చెల్లించే ప్రత్యేక కార్యాలయం ఇప్పటివరకు సూర్యారావుపేట పోలీస్ స్టేషన్ ఆవరణలో కొనసాగుతున్న విషయం తెలిసిందే. అయితే, ప్రజలకు పోలీస్ సేవలు మరింత చేరువ చేయాలనే ఉద్దేశ్యంతో, నగర పోలీస్ కమిషనర్ శ్రీ ఎస్.వి. రాజ శేఖరబాబు ఐ.పి.ఎస్. ఆదేశాల మేరకు ఈ చలాన్ కార్యాలయాన్ని ఆధునీకరించి కొత్తగా ఏర్పాటు చేశారు. ఇకపై ఈ కార్యాలయం సూర్యారావుపేట నుంచి ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియం ఎదురుగా ఉన్న వ్యాస్ కాంప్లెక్స్, మూడవ ఫ్లోర్ కు మార్చబడింది. ఈ కార్యాలయం ఈ రోజు నుంచే 24 గంటలూ సేవలు అందించనుంది. వాహనదారులు తమ వాహనాలపై పెండింగ్‌లో ఉన్న చలాన్లు చెల్లించడానికి ఎప్పుడైనా ఈ కార్యాలయాన్ని సందర్శించవచ్చు. కార్యాలయ సిబ్బంది ఎప్పటికప్పుడు సేవలు అందించడానికి సిద్ధంగా ఉంటారని పేర్కొన్నారు. ఇకపై వాహనదారులు తగిన సమయంలో చలాన్లు చెల్లించి, మోటారు వాహన చట్ట నిబంధనలు



పాటిస్తూ సురక్షితంగా ప్రయాణించాలని పోలీస్ శాఖ కోరుతోంది.

# గంగ జాతరలో పాల్గొని పట్టు వస్త్రాలు సమర్పించిన ముఖ్యమంత్రి దంపతులు

**కుప్పం, మే 21 (జనస్వరం ప్రత్యేక ప్రతినిధి)** : చిత్తూరు జిల్లా కుప్పంలో బుధవారం పర్యటించిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్థానిక ప్రసన్న తిరుపతి గంగమాంబ జాతరలో కుటుంబసమేతంగా పాల్గొన్నారు. సతీమణి భువనేశ్వరితో కలిసి వెళ్లిన ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఆలయం పూజారులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. జాతర కు వచ్చిన ముఖ్యమంత్రి దంపతులు టీటీడీ తరపున గంగమ్మకు పట్టువస్త్రాలు సమర్పించారు. అనంతరం సీఎం చంద్రబాబు దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించగా, అర్చకులు తీర్థప్రసాదాలు అందించారు. ఏడాదికి ఒకసారి మాత్రమే లభించే గంగమ్మ విశ్వరూప దర్శనాన్ని చేసుకుని, రాష్ట్రాన్ని గంగమ్మ చల్లంగా చూడాలని, ప్రజలంతా సంతోషంగా ఉండాలని కోరుకున్నట్లు ముఖ్యమంత్రి తెలిపారు. ముఖ్యంగా కుప్పం ప్రాంతంలో ప్రభుత్వం తలపెట్టిన అభివృద్ధిపనులు అన్నీ సకాలంలో పూర్తి అయ్యేలా, ప్రజలకు అభివృద్ధి ఫలాలు లభించేలా కరుణించాలని ప్రార్థించినట్లు సిఎం తెలిపారు. సీఎం చంద్రబాబుతో పాటు టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు, టీటీడీ బోర్డు సభ్యులు, పలువురు నాయకులు జాతరలో పాల్గొన్నారు. గంగమ్మ దర్శనానికి ముందుగా కుప్పం పర్యటనకు వచ్చిన సీఎం చంద్రబాబుకు జిల్లా అధికారులు, స్థానిక టీడీపీ నేతలు, కార్యకర్తలు ఘనస్వాగతం పలికారు. గంగమ్మ దర్శనం అనంతరం బెంగుళూరు మీదుగా సీఎం చంద్రబాబు అమరావతికి తిరుగు ప్రయాణమయ్యారు.



